కిక్కిరిసిన పీఎం పాలెం స్టేడియం



హోం గ్రౌండ్‌లో సత్తాచాటిన క్యాపిటల్స్ జట్టు

- చెన్నైపై 20 పరుగుల తేడాతో విజయం
- బ్యాటింగ్‌లో ప్రతిభ చూపిన కెప్టెన్ రిషబ్ పంత్
- వార్నర్, పృథ్వీషా మెరుపులు
- చివరి వరకు పోరాడిన ధోనీ

ఢిల్లీ బోణీ





విశాఖపట్నం (స్పోర్ట్స్), మార్చి 31:
సిక్సర్లు, బౌండరీలతో ఏసీఏ వీడీసీఏ స్టేడియం హోరెత్తింది. ప్రేక్షకుల కేరింతలతో మార్మోగింది. హోం గ్రౌండ్‌లో ప్రేక్షకుల నుంచి కనీస ప్రోత్సాహం లభించకపోయినా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఈ సీజన్‌లో తొలి విజయాన్నందుకుంది. ఆదివారం పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య ఢిల్లీ క్యాపిటల్స్ 20 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌పై విజయం సాధించింది. ఆశించిన స్థాయిలో మ్యాచ్ ఆద్యంతం ఇరుజట్ల ఆటగాళ్లు ప్రేక్షకులకు ఐపీఎల్ మజాను అందించకపోయినా, ధోనీ బ్యాటింగ్‌కు దిగడంతో సగటు క్రీడాభిమానులు సంతృప్తి చెందారు. చివర్లో ధనా ధన్ బ్యాటింగ్‌తో ధోనీ మెరుపులు ప్రేక్షకులను ఆనందడోలికల్లో తేలించాయి.

పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంను హోం గ్రౌండ్‌గా ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యులు బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించడంతో చెన్నైపై ఘన విజయం సాధించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆదిలో కొంచెం నెమ్మదిగా ఆడింది. మూడో ఓవర్‌లో చాహర్ బౌలింగ్‌లో డీప్ స్క్వేర్ లెగ్ మీదుగా డేవిడ్ వార్నర్ సిక్సర్ కొట్టడంతో ఊపు వచ్చింది. ఇక ఐదో ఓవర్‌లో వార్నర్ చెలరేగాడు. చాహర్ బౌలింగ్‌లో లాంగ్ లెగ్ మీదుగా సిక్సర్ బాది, తర్వాత బంతిని ఎక్స్‌ట్రా కవర్, పాయింట్ మీదుగా వరుసగా రెండు బౌండరీలు కొట్టి 14 పరుగులు రాబట్టాడు. ఈ స్థితిలో ఢిల్లీ క్యాపిటల్స్ 5.2 ఓవర్లలో 50 పరుగులు చేసింది. ఆరో ఓవర్‌లో మరో ఓపెనర్ పృథ్వీ షా బ్యాట్ ఝుళిపించాడు. ముస్తఫిజర్ బౌలింగ్‌లో షార్ట్ ఫైన్ లెగ్, ఫైన్ లెగ్, థర్డ్ మ్యాన్ మీదుగా వరుస బౌండరీలు బాదాడు. మ్యాచ్ ఏడో ఓవర్‌లో రవీంద్ర జడేజా బౌలింగ్‌కు వచ్చాడు. జడేజా వేసిన రెండో బంతిని పృథ్వీ షా మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ కొట్టగా, నాల్గో బంతిని డేవిడ్ వార్నర్ స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీకి తరలించాడు. 33 బంతుల్లో మూడు సిక్సర్లు, ఐదు బౌండరీలతో హాఫ్ సెంచరీ (51) పూర్తి చేసిన డేవిడ్ వార్నర్, పదో ఓవర్‌లో ముస్తఫిజర్ బౌలింగ్‌లో పతిరాణా గాలిలో అద్భుతమైన క్యాచ్ పట్టడంతో అవుటయ్యాడు. తర్వాత ఓవర్‌లో 27 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 43 పరుగులు చేసిన పృథ్వీ షా, జడేజా బౌలింగ్ స్టంపౌట్ అయ్యాడు. 10.3 ఓవర్లలో ఢిల్లీ క్యాపిటల్స్ వంద పరుగులు పూర్తి ... మిగతా 4వ పేజీలో

సినీ మాయ!

- కొత్త సినిమా డౌన్‌లోడ్ లింకులతో సైబర్ మోసాలు
- ఉచిత డౌన్‌లోడ్‌కు అందుబాటులో పలు వెబ్‌సైట్లు
- వాటి వెనుక రహస్యంగా దాగిన మాల్‌వేర్
- డౌన్‌లోడ్ చేస్తే సైబర్‌నేరగాళ్ల నియంత్రణలోకి సెల్‌ఫోన్లు
- ఇన్‌బిల్ట్ స్పై కెమెరాలతో లావాదేవీల సేకరణ
- వాటి ఆధారంగా బ్యాంకు ఖాతాల్లోని నగదు అపహరణ
- అలాంటి వెబ్‌సైట్ల జోలికి వెళ్లొద్దంటున్న పోలీసులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

'తన బ్యాంకు ఖాతా నుంచి రూ.19 వేలు డెబిట్ అయినట్టు మద్దిలపాలేనికి చెందిన యువకుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. రెండు రోజులుగా తాను ఎలాంటి బ్యాంకు లావాదేవీలు చేయకపోయినా అకౌంట్ నుంచి డబ్బు ఎందుకు డెబిట్ అయిందని ఆలోచించాడు. వెంటనే బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీస్తే వేరొకరి అకౌంట్‌కి ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ అయినట్టు చెప్పడంతో సైబర్‌నేరగాళ్ల పనేనని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.'

'మర్రిపాలేనికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు వారం రోజుల కిందట అతని అకౌంట్ నుంచి రూ.25వేలు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ అయినట్టు మెసేజ్ రావడంతో సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.'

సగటు మానవుడి బలహీనతను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇప్పటివరకు వివిధ పథకాలు, పెట్టుబడి లేకుండా ఆదాయం తదితర అంశాలతో ఎరవేసి బ్యాంకు ఖాతాలను లూటీ చేస్తుండగా.. తాజాగా కొత్త సినిమాలను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చంటూ వివిధ రకాల వెబ్‌సైట్లను పంపించి, క్లిక్ చేయగానే ఫోన్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకుని ఖాతాలను ఖాళీ చేసేస్తున్నారు. టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో దాదాపుగా అందరూ ఇంటర్‌నెట్‌ను విరివిగా వినియోగిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌తోనే బ్యాంకు లావాదేవీలు, సినిమాలు, యూట్యూబ్, వివిధ యాప్‌లలో రీల్స్ వీక్షణ ఇలా అన్నీ జరిగిపోతున్నాయి. దీనికి తోడు కొత్తసినిమాలు విడుదలైతే అదే రోజు ఆన్‌లైన్‌లో దానిని చూసేందుకు ఆత్రుత సైబర్ నేరగాళ్లకు అక్కరకొస్తోంది.

ఉచితం పేరుతో దోపిడీ...

కొన్ని వెబ్‌సైట్ల నుంచి ఉచితంగా సినిమాను వీక్షించడంతో పాటు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తుండడంతో చాలామంది ఆకర్షితులవుతున్నారు. పలు కారణాలతో థియేటర్‌కు వెళ్లి సినిమా చూడలేకపోయిన వారిలో ఎక్కువమంది ఇంట్లో కూర్చొని వెబ్‌సైట్‌ల నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఈ బలహీనతను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. సొంతంగా కొన్ని వెబ్‌సైట్లను రూపొందించి వాటిలో కొత్తసినిమాల పేరుతో వీడియోలను అందుబాటులో ఉంచుతున్నారు. ఎవరైనా కొత్తసినిమా కోసం ఆయా వెబ్‌సైట్‌లోకి వెళితే వారికి తెలియకుండానే సైబర్‌నేరగాళ్లు లింక్‌చేసిన మాల్‌వేర్ సెల్‌ఫోన్‌లో చొరబడుతోంది. ఆ తర్వాత ఫోన్ సైబర్‌నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్లిపోతుంది. ఫోన్‌తో జరిగే లావాదేవీలలతో మోసాలకు పాల్పడుతున్నారు. ఎవరైనా తమ ఫోన్ నుంచి ఆన్‌లైన్‌లో బ్యాంక్ లావాదేవీలు జరిపినా, యూపీఐ లావాదేవీలకు సంబంధించిన పిన్ ఎంటర్ చేసినా సైబర్‌నేరగాళ్లు వాటిని ప్రత్యక్షంగా ... మిగతా 4వ పేజీలో

భక్తిశ్రద్ధలతో ఈస్టర్




ఈస్టర్ సందర్భంగా జైలురోడ్డులోని క్రిస్టియన్ శ్మశానవాటికలో బంధువుల సమాధి వద్ద ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్‌ను ఘనంగా నిర్వహించారు. గుడ్ ఫ్రైడే రోజు శిలువపై మరణించిన ఏసు మూడో రోజైన ఆదివారం సమాధి నుంచి భక్తులకు దర్శనమిస్తాడు. ఈ నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జగదాంబ, వన్‌టౌన్, ఓల్డ్ జైల్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని క్రైస్తవులు కుటుంబసభ్యుల సమాధులను శుభ్రం చేసి పూలతో అలంకరించారు. కొవ్వొత్తులను వెలిగించి స్మరించుకున్నారు.

దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణ

- ఉత్కంఠకు తెరదించిన జనసేన అధిష్ఠానం



వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గానికి అభ్యర్థి ప్రకటనపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఇక్కడ నుంచి కూటమి అభ్యర్థిగా సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ టికెట్ ఖరారు చేశారు. ఈ మేరకు జనసేన రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ పేరున ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మధ్య సీట్ల అవగాహన మేరకు దక్షిణ నియోజకవర్గం జనసేనకు కేటాయించడంతో వంశీకృష్ణ పోటీచేస్తారని తొలుత ప్రకటించారు. అయితే ఇటీవల రాష్ట్రంలో జనసేన పోటీచేసే 21 స్థానాలకుగాను 18 మంది అభ్యర్థులతో విడుదల చేసిన జాబితాలో వంశీ పేరు లేకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. అయితే ఆదివారం పిఠాపురంలో ఉన్న పవన్ కల్యాణ్ పార్టీ ముఖ్య నేతలతో చర్చించి, దక్షిణ టికెట్‌ను వంశీకి ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి అభ్యర్థులను ప్రకటించినట్టయింది.

ఓటర్లకు పూర్తి సమాచారమివ్వాలి: కలెక్టర్



నక్కవానిపాలెం పోలింగ్ బూత్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఓటర్లకు పూర్తి సమాచారం ఇవ్వాలని, ఇందులో భాగంగానే మన పోలింగ్ బూత్-మన ఓటు కార్యక్రమాన్ని చేపట్టామని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమ అమలుతీరును ఆయన పరిశీలించారు. తూర్పు రిటర్నింగ్ అధికారి, జేసీ మయూర్‌అశోక్‌తో కలిసి కోటక్ సెల్సియస్, విశాలాక్షినగర్‌లోని టీవీకే స్కూలు పోలింగ్ బూత్‌లు సందర్శించారు. ఓటరు జాబితాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.

ఆశలు అవుట్!

- క్రమబద్ధీకరిస్తామని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పాదయాత్ర సమయంలో జగన్ హామీ
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
- సీఎం తీరుపై ఉద్యోగుల మండిపాటు
- ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది ఉద్యోగులు



పాదయాత్రలో జగన్‌తో మాట్లాడుతున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ పి.మణి (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

పాదయాత్ర సమయంలో హామీలనిచ్చి.. అధికారంలోకి వచ్చిన తరువాత మరిచిపోయిన ముఖ్యమంత్రి జగన్ తీరుపై కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టులోకి తెస్తామని ఇచ్చిన హామీకి జగన్ మంగళం పాడేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న సుమారు ... మిగతా 4వ పేజీలో

3 నుంచి పింఛన్ల పంపిణీ

- సచివాలయాల వద్ద ఏర్పాట్లు
- వలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు, బయోమెట్రిక్ యంత్రాల స్వాధీనానికి అధికారుల చర్యలు

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు అందజేసే సామాజిక పింఛన్లను ఈనెల మూడో తేదీన పంపిణీ చేయనున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగిసే క్రమంలో సోమవారం బ్యాంకులకు సెలవుదినం కావడంతో పింఛన్లకు అవసరమైన సొమ్ము డ్రా చేయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో పింఛన్ల పంపిణీలో జాప్యం జరిగిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. దీంతో పాటు పింఛన్‌దారుల జాబితా అందకపోవడమూ కారణమంటున్నారు.

మార్చి ఒకటోతేదీన జిల్లాలో 1,65,891 మందికి రూ.50.1 కోట్లు పింఛన్ల రూపేణా పంపిణీ చేశారు. వీరిలో జీవీఎంసీ పరిధి 1,38,231 మంది, గ్రామీణ ప్రాంతంలో 27,570 మంది ఉన్నారు. అయితే ప్రతినెలా పింఛన్ల సంఖ్యలో స్వల్ప మార్పు ఉంటాయని, ఏప్రిల్‌కు సంబంధించిన జాబితా ... మిగతా 4వ పేజీలో

ప్రచారంలోనే వలంటీర్లు

- వైసీపీ నేతలతోనే అంటకాగుతున్న వైనం
- ఇప్పటివరకూ 22 మంది తొలగింపు
- తొమ్మిది మంది స్వచ్ఛందంగా రాజీనామా
- ఎనిమిది మందిపై క్రిమినల్ కేసులు నమోదు



నార్త్ వైసీపీ అభ్యర్థి కేకే రాజు ఎన్నికల కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న వలంటీరు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రచారం వలంటీర్లు పాల్గొంటే చర్యలు తప్పవని ఎన్నికల కమిషన్ చేసిన హెచ్చరికలను వారు పెడచెవినపెడుతున్నారు. అధికారులు కొంతమంది వలంటీర్లపై చర్యలు తీసుకున్నా వెరవక ఇప్పటికీ అధికారపార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. పార్టీ కార్యకర్తలనే వలంటీర్లుగా నియమించుకోవడంతో వారు నేతలు వదలి పోవడం లేదు. సంక్షేమపథకాల పేరుతో వలంటీర్లు ఇప్పటికే ప్రజలతో పరిచయాలు పెంచుకున్నారు. వచ్చే ఎన్నికల్లో వీరి సేవలు కీలకమని గుర్తించిన వైసీపీ నేతలు ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించి తాయిలాలను కూడా అందజేశారు. వలంటీర్లను రాజకీయపార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. దీంతో వైసీపీ నేతలు వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటుచేసి వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తేనే వలంటీర్లు కొనసాగుతారని, కూటమి అధికారంలోకి వస్తే తొలగిస్తారంటూ బెదిరిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో ... మిగతా 4వ పేజీలో

వైసీపీకి భీమిలి జడ్పీటీసీ సభ్యుడి రాజీనామా

భీమునిపట్నం (రూరల్), మార్చి 31: భీమునిపట్నం జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు తన పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. అతనితో పాటు మరికొంతమంది నేతలు కూడా తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆదివారం సాయంత్రం తగరపువలసలో నిర్వహించిన సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు మాట్లాడుతూ ధర్మం వైపు నిలబడాలనే ఉద్దేశంతో వైసీపీకి రాజీనామా చేస్తున్నామన్నారు. వైసీపీలో కక్షసాధింపులు తప్ప అభివృద్ధి లేదని, నిరుద్యోగం పెరిగిపోయిందని, వాటికి నిరసనగా పార్టీ నుంచి వైదొలగుతున్నామన్నారు. వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచినందున జడ్పీటీసీ పదవికి కూడా రాజీనామా చేసి, జడ్పీ సీఈవోకు పంపిస్తున్నామన్నారు. మండలంలోని సింగనబంద సర్పంచి జీవీ నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల పైడిరాజు, పీఏసీఎస్ డైరెక్టరు గాడు తాతినాయుడు, వివిధ పంచాయతీల ఉప సర్పంచులు బుద్దరాజు సత్యనారాయణరాజు, నీలాపు అనసూయ, భుక్త రమావతి, ఎనిమిది పంచాయతీలకు చెందిన 32 మంది వార్డుసభ్యులు, సచివాలయ కన్వీనర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, వైసీపీ నాయకులు

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

- 4వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.14
సహరి (మంగళ)	4.35

వ్యాయామంతో ఆరోగ్యం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మురళీనగర్, మార్చి 31 : రోజూ వ్యాయాయం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని న్యూరాలజిస్ట్ జి.రమేష్ తెలిపారు. నిత్యం నడకతోపాటు మంచి ఆహార నియమాలను పాటిస్తే పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్ వంటి తీవ్ర సమస్యలను నియంత్రించవచ్చని సూచించారు. ఆదివారం మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో అపోలో ఆసుపత్రి వైద్య సిబ్బంది సాయంతో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను వైద్యులు జి.రమేష్, ఎం.మౌనిక, యూరాలజిస్ట్ జి.శాంతి వైద్య పరీక్షలు చేశారు. రోజూ తగినంత నీరు తాగడంతో కిడ్నీలో రాళ్ల సమస్యలు తలెత్తకుండా చూసుకోవచ్చని, వడదెబ్బకు దూరంగా ఉండొచ్చని పేర్కొన్నారు. శిబిరంలో 142 మందికి బీపీ, షుగర్, ఈసీజీ తదితరవైద్య పరీక్షలు చేశారు. వాకర్స్ క్లబ్ అద్యక్షులు పల్లా.చంద్రమౌళి, ఉపాధ్యక్షులు ఎ.వి.సుబ్బారావు, కోశాధికారి జె.కూర్మారావు, క్లబ్ కార్యవర్గ సభ్యులు సహకరించారు.

పూర్తిస్థాయిలో విద్యా హక్కు చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట, మార్చి 31: ఆరు నుంచి 14 ఏళ్లలోపు బాలలకు ఉచిత విద్యనందించే చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరమ్, బాల వికాస్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు కోరారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం, బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా హక్కు చట్టం 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో నరవ ప్రకాశరావు మాట్లాడారు. విద్యా హక్కు చట్టం పూర్తి స్థాయి లో అమలు చేయడం ద్వారా బాలలకు భరోసా ఇవ్వగలమన్నారు. అదే విధంగా చట్టం అమలు తీరుపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యా హక్కు చట్టం పుస్తకాన్ని ప్రదర్శించి వివరాలు తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ పీకే జోష్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ గౌరీశంకర్, రమణ, హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తుందంటూ ఫిర్యాదు

సీతమ్మధార, మార్చి 31: ఎన్నికలు ముగిసేంత వరకు సంక్షేమ పథకాలు ఆపేయాలని, పింఛన్లు కూడా వలంటీర్లు పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిన ఉత్తర్వులను కాదని వైసీపీ వాట్సాప్ గ్రూప్‌లో ప్రచారం చేస్తుందంటూ కలెక్టర్ మల్లికార్జునకు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు ఫిర్యాదు చేశారు. పింఛన్లు పంపిణీకి తాము సిద్ధమని, కానీ, టీడీపీ శ్రేణులు ఇందుకు అడ్డుతగులుతున్నారంటూ వాట్సాప్‌లో వైసీపీ ప్రచారం సాగిస్తోందని కలెక్టర్‌కు ఆయన వివరించారు. ఈమేరకు నగరంలోని వలంటీర్ల గ్రూపులు, సీవోలు, యూసీడీ సిబ్బంది వాట్సప్‌ల్లో వైరలవుతున్న మెసేజ్‌లను కలెక్టర్ దృష్టికి విష్ణుకుమార్‌రాజు తీసుకువెళ్లారు.

నేటి నుంచి కేవీలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

అక్కయ్యపాలెం, మార్చి 31: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో బాలవాటిక, మొదటి తరగతి ప్రవేశాల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్టు ప్రిన్సిపాల్ కమల్‌జిత్ తెలిపారు. ఈ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో వచ్చేనెల 15వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులు తొలి జాబితా ఏప్రిల్ 19న, రెండో జాబితా 29న, ఇంకా సీట్లు మిగిలితే మే 8న ప్రకటిస్తామన్నారు. 2 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి ఆఫ్‌లైన్‌లో పదో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించున్నట్లు చెప్పారు. తుది జాబితా 15న ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

ప్రజాశాంతి పార్టీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఏ పాల్

అక్కయ్యపాలెం, మార్చి 31: ప్రజాశాంతి పార్టీలో గాజువాక నుంచి పలువురు చేరారు. వీరికి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ రైల్వేన్యూకాలనీలో కార్యాలయంలో ఆదివారం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ అభివృద్ధితోపాటు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగాలన్నా ఎంపీగా తనను గెలిపించాలన్నారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దేశాన్ని పరిరక్షించే సత్తా తనకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నేతలు జిలుకర రవికుమార్, కో ఆర్డినేటర్ బాబోజీరావు, కాకినాడ ఈశ్వరరావు, ఎం.ఝాన్సీ పాల్గొన్నారు.

దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక

» కూటమి అభ్యర్థి వంశీకృష్ణ
» 34వ వార్డులో ప్రచారం

అల్లిపురం, మార్చి 28: విశాఖ దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి బృహత్తర ప్రణాళికతోముందుకు సాగుతున్నట్టు జనసేన నాయకుడు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ కృష్ణ అన్నారు. ఆదివారం 34వవార్డు అచ్చియ్యమ్మపేట వద్ద నుంచి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీతో కలిసి ఆయన ఎన్నికలప్రచారం నిర్వహించారు. ముందుగా నీలమ్మఅమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత నీలమ్మ వేపచెట్టు, కుమ్మరివీధి, అమ్మవారివీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రానున్న ఉమ్మడి ప్రభుత్వం చేయనున్న అభివృద్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ, ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చుతామని హామీ ఇచ్చారు. వ్యాపారులను కలిసి మద్దతు కోరారు. గత పదేళ్లుగా అభివృద్ధిని విస్మరించిన వాసుపల్లికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మోసాలను మరోసారి నమ్మే స్థితిలేదన్నారు. విశాఖపార్లమెంటు అభ్యర్థి భరత్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు వాసుపల్లి రామ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి పి. రాజేశ్వరి, దాసన సత్యనారాయణ, రాజు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.



34వార్డులో ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

టీడీపీ పోరుతోనే పోర్టు ఫెర్రీ కాలువల్లో పూడిక పనులు: గండిబాబ్జీ

జగదాంబ కూడలి: తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు పోరాటంతోనే జీవీఎంసీ అధికారులు పోర్టు ఫెర్రీ కాలువల్లో పూడికలను తొలగించే చర్యలు చేపట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. ఆదివారం కోటవీధి ఫెర్రీ రోడ్డులో కాలువల్లో పూడికతీత పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు ఈసందర్భంగా జోనల్ అధికారులకు పనులకు సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గఫూర్ (లడ్డూ), ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో సేఫ్టీ ఆఫీసర్స్ బాధ్యత చాలా కీలకం

» జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివ శంకర్ రెడ్డి



ఉత్తీర్ణులైన అభ్యర్థులతో శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ

కంచరపాలెం, మార్చి 31: పరిశ్రమల్లో సేఫ్టీ ఆఫీసర్స్ బాధ్యతలు చాలా కీలకమని విశాఖపట్నం చీఫ్ జాయింట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం సేఫ్టీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శివశంకర్ రెడ్డి మాట్లాడారు. సేఫ్టీ కోర్సులు పరిశ్రమల్లో అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉంటాయన్నారు. పరిశ్రమల్లో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం కలగకుండా జాగ్రత్త తీసుకోవడంలో సేఫ్టీ అధికారులు ఎంతో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలోనే సేఫ్టీ కోర్సుల శిక్షణను అందిస్తున్న ప్రభుత్వ కెమికల్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులను అభినందించారు. అనంతరం ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ మాట్లాడుతు సేఫ్టీ కోర్సుల శిక్షణ హబ్‌గా కెమికల్ కళాశాల నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డా.బీవీ లక్ష్మణరావు, కరికులం కో ఆర్డినేటర్ ఏ వరహాలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు: ఆర్వో

సీతమ్మధార, మార్చి 31: ఎన్నికల సంఘం ఆదేశాలను ఉల్లంఘించి వార్డు వలంటీర్లు రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొరాదని ఉత్తర నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి డి.అఖిల తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె ఆదివారం మాట్లాడారు. ప్రజలకు అందించే పింఛన్లు సహాఇతర నగదు పంపిణీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. అందుకువిరుద్ధంగావలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు.



ఉత్తర నియోజకవర్గ ఆర్వో అఖిల

జగన్నాటకంలో డీఎస్సీకి బ్రేక్

» సీఎం జగన్ ఉద్దేశించి మాజీ మంత్రి గంటా ట్విట్టర్‌లో విమర్శ

అక్కయ్యపాలెం, మార్చి 31: ఎన్నికల ముందు ఇచ్చిన జగన్నాటకంతోనే డీఎస్సీ ప్రక్రియకు బ్రేక్ పడిందని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్‌లో విమర్శించారు. అంతా ఆయన అనుకున్నట్లే, ఆయనకు తెలిసే ఇదంతా జరిగిందని ఆరోపించారు. ఐదేళ్లపాటు నిద్రపోయి, ఎన్నికల ముందు కోడ్ వస్తుందని తెలిసినా అడ్డగోలు నిబంధనలతో డీఎస్సీ ప్రకటన ఇచ్చారని పేర్కొన్నారు. నిరుద్యోగులు టెట్, డీఎస్సీ కోసం శిక్షణ కోసం వేలాది రూపాయలు ఖర్చుచేశారన్నారు. ప్రభుత్వం డీఎస్సీ అంటూ హడావుడి చేసి నిరుద్యోగుల నుంచి కోట్లాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేసిందని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేసిన ఈకుట్ర ప్రతి నిరుద్యోగికీ అర్థమైందని, ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని గంటా పేర్కొన్నారు. త్వరలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఈసారి తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పైనే పెడతారన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనతో ముఖ్యమంత్రిగా ఎనిమిది సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. 2014లో 9,061 పోస్టులు, 2018లో 7,729 పోస్టుల భర్తీతో వేలాదిమంది నిరుద్యోగుల కుటుంబా ల్లో వెలుగు నింపారన్నారు.

ఢిల్లీ బోణీ

... 3వ పేజీ తరువాయి

చేసింది. వరుసగా వికెట్లు పడిపోయి స్కోరు మందగించిన సమయంలో 13వ ఓవర్‌లో జడేజా బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా పంత్ భారీ సిక్సర్ కొట్టాడు. పతిరాణా బౌలింగ్‌లో స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీ కొట్టిన మార్ష్ (18), తర్వాత బంతికి క్లీన్ బౌల్డ్ కాగా, మార్ష్ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన స్టబ్స్ (0) పరుగులేమీ చేయకుండానే అవుటయ్యాడు. కాగా 18వ ఓవర్‌లో రిషబ్ పంత్ చెలరేగాడు. పతిరాణా బౌలింగ్‌లో లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, బౌండరీ, పాయింట్ మీదుగా మరో బౌండరీ కొట్టి ప్రేక్షకులను ఉత్సాహపరిచి (50), 31 బంతుల్లో నాలుగు బౌండరీలు, సిక్సర్లతో అర్ధ సెంచరీ పూర్తి చేసి ఐదో వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 191 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ తుది జట్టులో లోకల్ బాయ్‌కు రిక్కీబుయ్‌కు చోటు దక్కలేదు. లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 171 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఏడు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన దశలో రహానే (45), మిచెల్ (34) జట్టును ఆదుకున్నారు. దుబే (18) కొద్ది సేపు మెరిశాడు. వరుసగా వికెట్లు పడిపోయిన దశలో ధోనీ బ్యాటింగ్‌కు దిగడంతో ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. మూడు సిక్సర్లు, ఒక బౌండరీతో 37 పరుగులు చేసిన ధోనీకి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ రెండు, ముకేష్‌కుమార్ మూడు వికెట్లు పడగొట్టారు.

మా హయాంలో 14,200 టీచర్ పోస్టులు భర్తీ చేశాం

» రాష్ట్ర విద్యా శాఖమంత్రి బొత్స

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2019లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత 14,200 మందికి ఉపాధ్యాయ పోస్టింగ్‌లు ఇచ్చామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. నగరంలోని లాసెన్స్‌బే కాలనీ బీచ్‌రోడ్డులో వైసీపీ లోక్‌సభ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి ఇటీవల ప్రారంభించిన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం డీఎస్సీ విడుదల చేసి, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభించినప్పటికీ పోస్టింగులు మాత్రం ఇవ్వలేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి డీఎస్సీలో ఎంపికైన 14,200 మందికి పోస్టింగ్‌లు ఇచ్చామన్నారు. ఈ కారణంగానే ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఏర్పడకపోవడంతో డీఎస్సీ నిర్వహించాల్సిన అవసరం రాలేదని చెప్పుకొచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అయ్యే ఖాళీలను లెక్కించి 6,100 పోస్టులతో డీఎస్సీని ప్రకటించినా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేసి అడ్డుకున్నారన్నారు. ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని డీఎస్సీ ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి బొత్స అన్నారు. ప్రస్తుత ఎన్నికల తర్వాత ప్రజల నుంచి తిరుగుబాటు, తిరస్కరణ వస్తుందనే భయంతోనే లోకేశ్‌కు భద్రత కోసం బీజేపీతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై బీజేపీ ఇప్పుడు కచ్చితంగా ప్రకటన చేయాలని, ఆ తర్వాతే కూటమి ఎన్నికల ప్రచారం ప్రారంభించాలని మంత్రి బొత్స డిమాండ్ చేశారు. బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ, విశాఖలో పుట్టిపెరిగిన తనకు పుట్టిన నేలకు సేవ చేసే అవకాశం ఇన్నాళ్లకు దొరికిందన్నారు. విశాఖ ఎంపీగా ఒకసారి అవకాశం దక్కితే రాష్ట్రాభివృద్ధికి విశాఖను గ్రోత్‌ఇంజన్‌గా తయారు చేస్తానన్నారు.

ముగిసిన 'ట్రయంఫ్' విన్యాసాలు

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భారత్, అమెరికన్ నేవీ మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా ఎక్స్ టైగర్ ట్రయంఫ్ పేరుతో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న విన్యాసాలు శనివారంతో ముగిశాయి. ఇరు దేశాలు రెండు దశల్లో ఈ విన్యాసాలను నిర్వహించారు. ఈనెల 18 నుంచి 25 వరకు హార్బర్ ఫేజ్ విన్యాసాలను నిర్వహించగా, రెండో దశలో సీఫేజ్ విన్యాసాలను ఈనెల 26 నుంచి 30 వరకు నిర్వహించారు. ముగింపు విన్యాసాల్లో భారత్‌కు చెందిన లాండన్ ప్లాట్‌పార్మ్ డాక్, లాండింగ్ షిప్ ట్యాంక్స్ భాగస్వామ్యమయ్యాయి. ల్యాండింగ్ ఎయిర్ క్రాఫ్ట్, హెలికాప్టర్స్‌తో విన్యాసాలు నిర్వహించారు. విన్యాసాల్లో ఇండియన్ ఆర్మీకి చెందిన బృందాలు భాగమయ్యాయి. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన మీడియం ఎయిర్‌క్రాఫ్ట్, ట్రాన్స్‌పోర్ట్ హెలికాప్టర్, రాపిడ్ యాక్షన్ మెడికల్ టీమ్ ఈ విన్యాసాల్లో పాల్గొంది. అమెరికా నేవీకి చెందిన హెలికాప్టర్స్, డెస్ట్రాయర్స్ వంటివి కూడా పాలుపంచుకున్నాయి.



సీ ఫేజ్ విన్యాసాల దృశ్యం

ఏ రాజకీయ పార్టీకి 'నాగవంశీయులు మద్దతు లేదు'

జగదాంబ కూడలి, మార్చి 31: దక్షిణ నియోజకవర్గ పరిధిలో నాగవంశ సామాజిక వర్గం ఏ రాజకీయ పార్టీ కి మద్దతు తెలపడంలేదని గ్రేటర్ 30వ వార్డు కుమ్మరవీధి ఆంధ్రా నాగవంశ సంక్షేమ సంఘం కమిటీ ప్రతినిధులు డి.సత్యనారాయణ, కాళ్ల కిరణ్, రాజు, నాని స్పష్టంచేశారు. తమ సామాజిక వర్గానికి చెందిన కొందరు స్వార్థరాజకీయాలతో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటనలు చేయడం తగదని వారన్నారు.

కప్పరాడలో కత్తులతో యువకులు హల్‌చల్

» పాత తగాదాల నేపథ్యంలో
ఇరువర్గాల మధ్య ఘర్షణ

కంచరపాలెం, మార్చి 31: కంచరపాలెం పరిధి కప్పరాడ ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఆదివారం కొంత మంది యువకులు కత్తులతో హల్‌చల్ చేసి స్థానికులను భయభ్రాంతులకు లోనుచేశారు. వివరాలివి.. కంచరపాలెం కప్పరాడ, జైప్రకాశ్ నగర్‌లకు చెందిన ఇరువర్గాల మధ్య పాత తగాదాలు నేపథ్యంలో ఆదివారం ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో దివ్యతేజ, మహేష్, మధన్ అనే యువకులపై గణేశ్ వర్గానికి చెందిన వ్యక్తులు కత్తులతో దాడి చేసినట్టు సమాచారం. ఈ ఘర్షణలో గణేష్‌తో పాటు ఆయన ఇద్దరు మేనల్లుళ్లు దాడిలో పాల్గొని అవతలి వర్గానికి చెందిన దివ్యతేజ, మహేశ్, మదన్‌పై దాడి చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం బాధితులను కేజీహెచ్‌కు స్థానిక పోలీసులు తరలించారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘర్షణకుసంబంధించి పూర్తి వివరాలుతెలియాల్సి ఉంది.

వన్‌టౌన్‌లో గ్యాంగ్ వార్..:

యువతి కోసం కొట్లాట

జగదాంబ కూడలి, మార్చి 31: వన్‌టౌన్ రెల్లివీధి పరిధితో గ్యాంగ్‌వార్ చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ భాస్కర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ యువతి విషయంలో ఇరువర్గాల మధ్య ఈఘటన చోటుచేసుకున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంలో ఒక వర్గంపై మరొక వర్గం కత్తులు దూ సిం ది. విషయం వన్‌టౌన్ పోలీసులకు చేరడంతో పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ ఇరువర్గాలు రౌడీషీటర్ లిస్ట్‌లో పేర్లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. దీం తో పోలీసులు ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌న్ తరలించారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు సీఐ వెల్లడించారు. రెల్లివీధిలో ఈఘటనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో స్థానికులు ఆందోళనకు లోనయ్యారు. పోలీసులు రంగ ప్రవేశంతో పరిస్థితి అదుపులోకి రావడంతో ఊపిరిపీల్చుకున్నారు.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బీసీల ద్రోహి జగన్



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మహారాణిపేట, మార్చి 31: బీసీ అభివృద్ధి తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమితోనే సాధ్యమని ఉత్తరాంధ్ర బీసీ రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు రాజు గౌడ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ బీసీల ద్రోహి అని, రాష్ట్రంలో బీసీ వర్గాలను విడగొట్టి అణచివేతకు లోనుచేస్తున్నారన్నారు. బీసీ యువత ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారన్నారు. ప్రజలుఅప్పులు పాలవుతున్నారన్నారు. దక్షిణ నియోజకవర్గం అభివృద్ధి జనసేన నేత వంశీకృష్ణ శ్రీనివాస్‌తోనే సాధమన్నారు.

ప్రతిపక్షాలపై బీజేపీ కక్ష సాధింపు వైఖరి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

డాబాగార్డెన్స్, మార్చి 31: ప్రతిపక్ష పార్టీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. ఆదివారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆమ్‌ఆద్మీ, సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ల అంశం బయటకు రాగానే, దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. ప్రధాని మోదీ, అమిత్‌షాల దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పాలన్నారు. నాయకులు ఎం.పైడిరాజు, రమేష్, సీతల్, సుధాకర్, కృష్ణారావు, లలిత, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహంవద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు జ్ఞానాపురంలోని జూబ్లీ హైస్కూలులో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాలకు చెందిన 1.80 లక్షల జవాబుపత్రాలు విశాఖకు కేటాయించారు. మూల్యాంకనం కోసం 1000 మంది టీచర్లను నియమించగా, అనకాపల్లి నుంచి అదనంగా మరో 120 మంది ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకోనున్నారు. జూబ్లీ హైస్కూల్‌లో మొత్తం 26 గదుల్లో జరిగే మూల్యాంకనం రెండు బ్లాకులగా విభజించారు. డీఈవో ఎల్. చంద్రకళ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. ఈ బ్లాకులకు డైట్ సీ నియర్ లెక్చరర్లు మాణిక్యాలనాయుడు, గౌరీశంకర్ డిప్యూటీ క్యాంపు అధికారిగా, జిల్లాపరీక్షల విభాగం సహాయ కమిషనర్ మురళీ స్ట్రాంగ్‌రూమ్ వద్ద డిప్యూటీ క్యాంపు అధికారిగా విధులు నిర్వర్తిస్తారు. వన్‌టౌన్‌లోని క్వీన్ మేరీస్ హైస్కూల్‌లో అనేకఏళ్లుగా మూల్యాంకనం నిర్వహించినఅధికారులు తొలిసారిగా జూబ్లీ స్కూలుకు ఈ ఏడాది మార్చారు.

కొత్తపాలెంలో వన్య ప్రాణులు స్వాధీనం

» పోలీసుల అదుపులో పెంపుడు జంతువులు విక్రయించే వ్యాపారి



నెమలి పిల్లలు, నక్షత్ర తాబేళ్లను పరిశీలిస్తున్న ఎస్ఐలు

గోపాలపట్నం, మార్చి 31: పెంపుడు జంతువులు విక్రయించే ఓ వర్తకుడి వద్దనుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పలు వన్యప్రాణులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరా లివి.. కొత్తపాలెంలోని సంతోశ్‌నగర్ కాలనీకి చెందిన పిల్లా నాగేశ్వరరావు పెంపుడు జంతువులను విక్రయిస్తుంటాడు. అయితే, ఆయన వద్ద నిషేధిత వన్య ప్రాణులున్నట్టు సమాచారం అందడంతో ఏసీపీ ప్రసాద్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి ఆయన ఇంటిపై దాడి చేశారు. నాగేశ్వరరావు ఇంటి వద్దనున్న 15 నక్షత్ర తాబేళ్లు, రెండు నెమలి పిల్లలు, ఒక జింక కొమ్మును వారు స్వాధీనం చేసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా గాజువాక ప్రాంతానికి చెందిన గొందేసి శ్రీనివాసరావు అనే వర్తకుడి నుంచి నక్షత్ర తాబేళ్లు తీసుకున్నట్టు నాగేశ్వరరావు పోలీసులకు తెలిపాడు. అలాగే, కొద్ది రోజుల క్రితం నర్సీపట్నం నుంచి నెమలి గుడ్లు తీసుకువచ్చి, ఇంటి దగ్గర కోడితో పొదిగించగా రెండు పిల్లలు పుట్టడంతో వాటిని పెంచుకుంటున్నట్టు పేర్కొన్నాడు. ఈ విషయంపై పోలీసులు విచారణ సాగిస్తున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న వన్య ప్రాణులను అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్నట్టు ఎస్ఐ వి.అప్పలనాయుడు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ మల్లేశ్, ఎస్ఐ భరత్ కుమార్ రాజు పాల్గొన్నారు.

సినీ 'మాయ'!

... 3వ పేజీ తరువాయి

చూసి, ఆ వివరాలతో ఖాతాల్లోని నగదుని కొల్లగొట్టేస్తున్నారు. బ్యాంకు నుంచి బాధితులకు ఓటీపీ కూడా రాకుండా నోటిఫికేషన్‌ను మ్యూట్‌లో పెట్టేస్తున్నారు. నగరంలో ఇటీవల ఈతరహా మోసాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఆ వెబ్‌సైట్ల జోలికి వెళ్లొద్దు



ఇంటర్నెట్‌లో ఉచితంగా సినిమాలు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉన్న వెబ్‌సైట్ల జోలికి వెళ్లపోవడమే మంచిది. ఉచితంగా ఎవరైనా ఎందుకు ఇస్తారు? ఏదో ప్రయోజనం ఉంటేనే ఆ సదుపాయం కల్పిస్తారనేవిషయాన్ని గుర్తించాలి.అన్నివెబ్‌సైట్లుసైబర్‌నేరగాళ్ల నియంత్రణలో ఉండకున్నా, చాలా వెబ్‌సైట్లు వారే రూపొందించి వారి నియంత్రణ లోనేఉంచుకుంటారు. చాలామంది కొత్తసినిమాలు, పోర్న్ వెబ్‌సైట్లలోకి వెళ్లి తమ బ్యాంక్ ఖాతాల్లోని డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఇలాంటి ఫిర్యాదులు ఇటీవల పెరుగుతున్నాయి. దీనిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి.

- కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ

ఆశలు అవుట్!

... 3వ పేజీ తరువాయి

25 వేల మంది అవుట్ సోర్సింగ్, మరో ఐదు వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని మండిపడుతున్నారు.

ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీలతో ఆశలు పెట్టుకున్నామని, వేతనాలు పెరిగి జీవితాలు బాగుపడతాయని భావించామని, తీరా ఐదేళ్లు గడిచినా ఒక్కటి కూడా అమలుకాక ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు. జగన్ ఇచ్చిన హామీల అమలుకోసం ఐదేళ్లుగా నేతల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో దాదాపు 70 శాతం మంది ఆరోగ్యశాఖలో పని చేస్తుండగా, మిగిలిన 30 శాతం మంది జీవీఎంసీ, ఫారెస్ట్, సమగ్ర శిక్ష అభియాన్, పశు సంవర్ధక శాఖల్లో పనిచేస్తున్నారు.

హామీ అమలుకు మంగళం

సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేసి ఉంటే జిల్లాలో 30 వేల మందికిపైగా ఉద్యోగులకు మేలు జరిగేది. ప్రస్తుతం కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.18 వేల నుంచి రూ.38 వేల వరకు వేతనం లభిస్తోంది. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి ఉంటే.. రెగ్యులర్ ఉద్యోగులకు లభించే వేతనం దక్కేది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.24 వేలు చెల్లిస్తున్నారు. కనీస వేతనాల హామీ అమలైతే రూ.30 వేలకుపైగా లభించేదని చెబుతున్నారు. అదే సమయంలో ఈ రెండు కేటగిరీల్లో ఉద్యోగ భద్రత ఉండేదంటున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలయ్యేదని పేర్కొంటున్నారు.

కేంద్ర పథకమంటూ దాటవేత

కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని అమలుచేయాలని ఉద్యోగులు కోరితే.. ప్రభుత్వ పెద్దలు భిన్నమైన వాదనను తెరపైకి తీసుకు వచ్చారని చెబుతున్నారు. సమగ్ర శిక్ష అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్ వంటి స్కీమ్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుచేస్తున్నాయని, వీటిలో పనిచేసే వారిని రెగ్యులరైజ్ చేయలేమని ప్రభుత్వం స్పష్టం చేసిందంటున్నారు. పాదయాత్ర సమయంలో ఈ అంశాలపై జగన్‌కు అవగాహన ఉన్నప్పటికీ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత మాట మారుస్తున్నారని ఉద్యో గులు మండిపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమలుచేస్తున్న పథకాల్లోనే సుమారు నాలుగు వేల మంది వరకు కాంట్రాక్టు ఉద్యోగులున్నారని, వారందరినీ మభ్య పెట్టి.. ఈ తరహా వ్యాఖ్యలు చేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నమ్మించి మోసం చేశారు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మేలు చేస్తామని ఇచ్చిన హామీని అమలుచేయకుండా నమ్మించిమోసం చేశారు. ఐదేళ్లుగా ప్రభుత్వ ప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. ఉద్యోగులకు భద్రత, ఇతర బెనిఫిట్స్ అందిస్తామని ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారు. కేంద్ర పరిధిలోని స్కీమ్ అంటూ అడ్డగోలు వాదనను తెరపైకి తీసుకురావడం దారుణం. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 30 వేల మందిఉద్యోగులకు ఈ ప్రభుత్వం అన్యాయం చేసింది.

-పి.మణి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ

ప్రచారంలోనే వలంటీర్లు

... 3వ పేజీ తరువాయి

పాల్గొనడం వల్ల అధికారులు ఇప్పుడు తొలగించినా, అధికారంలోకి వస్తే మళ్లీ తీసుకుంటామని భరోసా ఇస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో అధికారపార్టీ అభ్యర్థులకు మద్దతుగా వలంటీర్లు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

ఇలా పాల్గొన్నవారిపై విపక్ష నేతలు అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేస్తుండడంతో వారిని విధుల నుంచి తొలగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకూ ఎన్నికల ప్రచారం పాల్గొన్నారనే అభియోగంపై 22 మంది వలంటీర్లను అధికారులు తొలగించారు. వీరిలో జోన్-3 పరిధిలో ముగ్గురు, జోన్-6 పరిధిలో ఆరుగురు, జోన్-5 పరిధిలో ముగ్గురు, జోన్-4 పరిధిలో ఒకరు, జోన్-8 పరిధిలో ఒకరు, పద్మనాభం మండలంలో ఏడుగురు, భీమిలి మండలంలో ఒకరు ఉన్నారు. మరో తొమ్మిది మంది స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తొలగించిన వలంటీర్లలో ఎనిమిది మందిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వీరితోపాటు 52వ వార్డుకి చెందిన రిసోర్స్‌పర్సన్ ఒకరు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో ఆమెపై కూడా కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

... 3వ పేజీ తరువాయి

సోమవారం వస్తుందంటున్నారు. ఆ వెంటనే సచివాలయ ఉద్యోగులకు డబ్బు అందజేస్తారు. ఎన్నికల నేపథ్యంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియకు వలంటీర్లను దూరం పెట్టడంతో ఆ బాధ్యతను సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. దీంతో సగటున ఒక్కో ఉద్యోగికి పది నుంచి 15 మంది వలంటీర్లు పంపిణీ చేసే మొత్తాన్ని అందిస్తారు. ఏప్రిల్, మే పింఛన్లను సచివాలయంలో మాత్రమే పంపిణీ చేసేలా సెర్ప్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. పింఛనుదారులు ఆధార్‌కార్డు, లేదా ఇతర గుర్తింపుకార్డు తీసుకురావాలని సూచించారు. కాగా వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, బయోమెట్రిక్ యంత్రాలను స్వాధీనం చేసుకోవాలని ఎన్నికల సంఘం నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలందాయి.ఆదివారం సెలవుకావడం తో సోమవారం వాటిని స్వాధీనం చేసుకుని సచివాలయ సిబ్బందికి అందజేస్తామని ఓ అధికారి వివరించారు.



అజీమాబాద్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న శ్రీభరత్

ఇఫ్తార్ విందులో పాల్గొన్న శ్రీభరత్

గాజువాక, మార్చి 31: గాజువాకలోని అజీమాబాద్‌లో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో ఉమ్మడి పార్టీల విశాఖ లోకసభ అభ్యర్థి శ్రీభరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో చేపట్టిన ఇఫ్తార్ విందులో తనను భాగస్వామున్ని చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముస్లింలకు తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, స్థానిక నాయకులు, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు భూమి పూజ

ఎన్.ఎ.డి. జంక్షన్, మార్చి 31: జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం గవరవీధిలోని శివాలయం, సంతోషిమాతాలయం ఆధునీకరణ పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. రూ.15 లక్షలతో ఆలయ పునర్నిర్మాణానికి వైసీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ముందుకు రావడంతో భూమి పూజ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ సోదరి, ఎలమంచిలి చైర్‌పర్సన్ పీలా రమాకుమారి, వైసీపీ నాయకులు నమ్మి శ్రీను, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాంబే కాలనీలో అన్న సమారాధన

పెదగంట్యాడ, మార్చి 31: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబేకాలనీలోని వేంకటేశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని ఆదివారం అన్న సమారాధన చేపట్టారు. నాలుగు రోజుల పాటు జరిగే జరుగున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా వెంకన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి మానవతా ట్రస్టు చేయూత



బాధితునికి వీల్ చైర్ అందజేసిన దృశ్యం

గాజువాక, మార్చి 31: అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న తోకాడ ప్రాంతానికి చెందిన పి.వరప్రసాద్ అనే వ్యక్తికి మానవత సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ దీనకొండ కృష్ణంరాజు మాట్లాడుతూ పేదలు, అనాథలను ఆదుకునేందుకు ట్రస్టు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 280 మృతదేహాలను శాంతి రథం ద్వారా తరలించామని, పదుల సంఖ్యలో అనాథలకు అంత్యక్రియలు నిర్వహించామన్నారు. తమ సేవల్లో విద్య, వైద్యానికి అధిక ప్రాధన్యతనిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ఎంవీ సుబ్బారావు, బలివాడ సత్యారావు, ప్రసాద్‌రావు, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

'కక్ష సాధింపులకు పాల్పడుతున్న ప్రభుత్వం'

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 31: స్టీల్‌ప్లాంట్ విద్యుత్ బిల్లులు చెల్లించనందున కరెంటు సరఫరా నిలిపివేస్తామని రాష్ట్ర ప్రభుత్వం బెదిరిస్తుందని సీబీటీయూ గౌరవ ధ్యక్షుడు జె.అయోధ్యరాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్లాంట్‌కు కోల్ ఎందుకు రావడం లేదు, రైల్వే ర్యాక్‌లు ఎందుకు ఇవ్వడం లేదు, ప్లాంట్‌లో సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉన్నా ప్రతినెలా 150 మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎందుకు కొనుగోలు చేయాల్సి వస్తుందన్న అంశాలపై పార్లమెంట్ సభ్యులు మాట్లాడకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉక్కుపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్:** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా:** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్:** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర:** మౌర్య (గోపాలపట్నం)
- **గామి:** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 18, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 22, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 150, బరబటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 30, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 160, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 54, ఆగాకర 52, పొటల్స్ 46, కీరదోస 24, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..



ప్రచారంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, కోన తాతారావు, కరణంరెడ్డి, తదితరులు



కొత్తపాలెంలో శ్రీభరత్, గణబాబులకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

పెదగంట్యాడ, మార్చి 31: రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవలసిన సమయం ఆసన్నమైందని, ఇప్పుడు మేల్కొనకపోతే రాష్ట్రం మరింత నాశనమై పిల్లల భవిష్యత్తు అంధకారంలో పడుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సాయంత్రం పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ముందుగా సీతానగరం ముత్యమాంబ ఆలయంలో పూజలు చేశారు. ఆయా ప్రాంతాల ప్రజలు పల్లాకు పూలమాలలు వేసి మంగళహారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి చాన్స్ ఇస్తే వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాళా తీయించిందని, ఇప్పుడు మళ్లీ అలాంటి పొరపాటు చేయకుండా ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర ప్రగతికి బాటలు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీతానగరం, ఎస్సీకాలనీ, ఎన్టీఆర్ జంక్షన్, సీకువానిపాలెం, నెల్లిముక్కు, అయ్యన్నపాలెం, మొల్లివానిపాలెం ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, పులి వెంకటరమణారెడ్డి, పి.సోమునాయుడు, కరణంరెడ్డి నరసింగరావు, రమణ, ఎం.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

గాజువాక: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాల నాశనం చేసిందని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 70వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. జనసేన పార్టీ గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ వైసీపీని ఓడించడమే ధ్యేయంగా అందరం ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాసరావు, చట్టి గోపి, జి.అప్పారావు, లంక మురళీదేవి, శంకరరావు, పావని, వాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం టీడీపీతోనే

సాధ్యం: విశాఖ లోక్‌సభ అభ్యర్థి శ్రీభరత్

గోపాలపట్నం: ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని విశాఖ లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో ఆదివారం సాయంత్రం ఆయనతో పాటు పశ్చిమ ఎమ్మెల్యే, అభ్యర్థి పి.గణబాబు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గణబాబు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రచారంలో పాల్గొన్న వారికి మహిళలు పూలమాలలు వేసి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, నాయకులు బొడ్డేటి విజయ్‌కుమార్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



కుంచమాంబ కాలనీలో రక్షణ పలకలు లేని డ్రైనేజీ

ప్రమాదాలకు నిలయంగా డ్రైనేజీలు

ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్న వాహనదారులు

ఆటోనగర్, మార్చి 31: జీవీఎంసీ 71వ వార్డు పరిధి కుంచమాంబ కాలనీలో డ్రైనేజీలను నిర్మించి వాటిపై రక్షణ పలకలను ఏర్పాటు చేయడాన్ని విస్మరించారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతం నుంచి వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ వ్యాన్‌లు వంటివి ఈ రహదారిలోనే ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. పాత గాజువాక, చినగంట్యాడ ప్రధాన జంక్షన్లలో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతుంటుంది. అటువంటి సమయాలలో నగరానికి చేరుకోవలసిన వాహనాలను ఈ రోడ్డు మార్గం గుండానే మళ్లించడం జరుగుతుంటుంది. ద్విచక్ర వాహనాలు ఒకదాని పక్కన ఒకటి ప్రయాణించేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా రక్షణ పలకలు లేని కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని పలువురు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కుంచుమాంబ కాలనీ లోతట్టు ప్రాంతం కావడంతో చిన్నపాటి వాన కురిసినా ఈ డ్రైనేజీ నిండిపోయి మురుగు నీరంతా రోడ్డుపై పొంగి పొర్లుతుంటుంది. డ్రైనేజీలను నిర్మిస్తున్న సమయంలోనే రక్షణ పలకలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఎల్‌వీ నగర్, డ్రైవర్స్ కాలనీ, చట్టివానిపాలెం, ఎల్‌బీఎస్ నగర్, విశ్వనాథ కాలనీ, ఆటోనగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న డ్రైనేజీలపై తక్షణమే రక్షణ పలకలు ఏర్పాటు చేసేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదభరితంగా మారిన డ్రైనేజీ

భక్తి శ్రద్ధలతో ఈస్టర్

చర్చిలు, శ్మశానవాటికల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రిస్టియన్లు

వేపగుంట, మార్చి 31: ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఆదివారం పలు చర్చిల్లో సందడి వాతావరణం నెలకొంది. క్రైస్తవులు పెద్దసంఖ్యలో విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా వేపగుంట ముత్యమాంబ కాలనీలోని బైబిల్ మిషన్ సమృద్ధి గృహ ప్రార్థనా మందిరంలో రెవరెండ్ ఫాదర్ సీహెచ్ సుందరరావు మాట్లాడుతూ అందరూ సేవ చేయడమే పరమావధిగా భావించాలని, ప్రతి వ్యక్తిలోనూ దైవత్వాన్ని చూడాలని చెప్పిన మహనీయుడు ఏసుక్రీస్తు అని అన్నారు. ఏసు ప్రభువు మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలని సూచించారు. తొలుత పలువురు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ డేనిశ్, సువర్ణరాజు, యోహన్, అంజనేయులు, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.



కరాస శ్మశానవాటికలోని సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

కరాస శ్మశానవాటికలో ప్రార్థనలు..

ఎన్.ఎ.డీ జంక్షన్: ఈస్టర్ సందర్భంగా 52వ వార్డు పరిధి కరాస క్రిస్టియన్ శ్మశానవాటికలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధులను పువ్వులతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. వేకువజాము ఐదు గంటల నుంచే పెద్దసంఖ్యలో ప్రజలు శ్మశానవాటికలోని తమ కుటుంబీకు సమాధుల వద్దకు చేరుకున్నారు. శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేసిన క్రిస్టియన్ పెద్దలు ఆంథోని, డేవిడ్ పాల్‌ను వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పీలా రమాకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ సోదరులు వై.రాజు, వై.ప్రభుదాస్, సుధాకర్, డియోఫిలాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సందేహాలను నివృత్తి చేసిన 'మన పోలింగ్ బూత్'

ప్రచార లోపంతో స్పందన అంతంత మాత్రమే..

అగనంపూడి, మార్చి 31: పలు పోలింగ్ బూత్‌లలో ఓటర్ల సందేహాలను ఆదివారం నిర్వహించిన 'మన పోలింగ్ బూత్-మన ఓటు' కార్యక్రమం ద్వారా బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు నివృత్తి చేశారు. ఇందులో భాగంగా 79, 85 వార్డుల పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా కేంద్రాలకు విచ్చేసిన ఓటర్ల సందేహాలను బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు తీర్చడంతో పాటు పోలింగ్ కేంద్రాల చిరునామాతో పాటు ఓటర్ల వరస సంఖ్యను తెలియజేశారు. ఫార్మాసిటీ పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఎల్‌వోలు ఉదయ్‌కుమార్, శ్రావణి, భాస్కరరావు, సూపర్‌వైజర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్‌లలో మన పోలింగ్ బూత్-మన ఓటు కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే ప్రచార లోపంతో అత్యధిక ఓటర్లు ఈ కార్యక్రమంపై పెద్దగా ఆసక్తి కనబరచలేదు. బీఎల్వోలు ఓటరు జాబితాలతో ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నా ప్రజల నుంచి స్పందన పెద్దగా రాలేదు. కొన్ని బూత్‌ల వద్దకు తక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చి జాబితాలోని తమ పేర్లను చూసుకున్నారు. నివాసం ఒకచోట, పోలింగ్ కేంద్రం మరోచోట ఉండడంపై పలువురి నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తహసీల్దార్ బంగార్రాజు ఆయా పోలింగ్ బూత్‌లను సందర్శించి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



పెందుర్తిలోని నాయుడుపాలెం పోలింగ్ బూత్ వద్ద ఖాళీగా కూర్చున్న బీఎల్‌వోలు

పెదగంట్యాడ: మన పోలింగ్ బూత్-మన ఓటు కార్యక్రమాన్ని పెదగంట్యాడలోని పోలింగ్ బూత్ లలో నిర్వహించారు. బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు తమ పరిధిలోని ఓటర్ల జాబితా పట్టుకుని ఆయా కేంద్రాల వద్ద కూర్చున్నారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మండపాల వద్ద జాబితాలతో ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు విచ్చేసి తమ ఓటర్ కార్డులను చూపించి తమ వరస సంఖ్య గురించి తెలుసుకోవడంతో పాటు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

కూర్మన్నపాలెం: ఓటర్లలో అవగాహన పెంచేందుకు నిర్వహించిన మన పోలింగ్ బూత్-మన ఓటు కార్యక్రమానికి అంతంత మాత్రంగానే స్పందన లభించింది. కణితి, రాజీవ్‌నగర్, తదితర బూత్‌లలో ఉదయం పది గంటల నుంచి బీఎల్వోలు, సూపర్‌వైజర్లు అందుబాటులో ఉన్నప్పటికీ పదుల సంఖ్యలో ప్రజలు విచ్చేసి తమ ఓట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పెద్దగా రాకపోవడంతో సాయంత్రం వరకు సిబ్బంది ఖాళీగానే కూర్చున్నారు.

ముగిసిన వినాయక ఆలయ వార్షికోత్సవాలు

శ్రీనగర్, మార్చి 31: స్థానిక అఫీషియల్ కాలనీలో సంపత్ వినాయక మందిర 15వ ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి ప్రదీప్ శర్మ పర్యవేక్షణలో స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, సామూహిక కుంకుమ పూజలు, హోమాలు జరిపారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి గణనాథున్ని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అక్కిన లక్ష్మణరావు, ఎం.మహాలక్ష్మినాయుడు, సుబ్బరాజు, రాజు, సాయి, బాబ్జీ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.



పువ్వులు, గరికెతో అలంకృతులైన వినాయకుడు... పక్కన కోలాటంలో పాల్గొన్న మహిళలు, బాలికలు



విద్యార్థులతో మాట్లాడుతున్న పిల్లా రమాకుమారి

ఆనంద్‌కుమార్‌ను గెలిపించండి

'ఆడారి' సోదరి, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

మల్కాపురం, మార్చి 31: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించే బాధ్యతను కార్యకర్తలంతా తమ భుజస్కంధాలపై వేసుకోవాలని అయన సోదరి, ఎలమంచిలి మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి కోరారు. 40వ వార్డులో ఆదివారం నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో ఆమె మాట్లాడుతూ ఏసు మార్గం అందరికీ అనుసరణీయమని, అందరూ శాంతి మార్గంలో నడవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో ముచ్చటిస్తూ అమ్మఒడి పథకం గురించి, విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పశ్చిమ నియోకకవర్గ పరిశీకురాలు పీలా ఉమారాణి, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిమాత ఆలయ వార్షికోత్సవం



విద్యార్థులతో కలిసి కోలాటమాడుతున్న పీలా శ్రీనివాసరావు, 'ముమ్మన'

పెందుర్తి-రూరల్, మార్చి 31: మండలంలోని చింతల అగ్రహారంలో కొలువుదీరిన దుర్గమాంబ, బండిమాంబ, మెట్టమాంబ (త్రిమాత) ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కోలాటం పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు విద్యార్థినులతో కలిసి కాసేపు సరదాగా కోలాటం ఆడారు. అనంతరం విజేతలకు వారు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మద్దాల శ్రీనివాసరావు, సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, మాజీ సర్పంచులు తాతారావు, అప్పారావు, వెంకటరమణ, పెందుర్తి వైస్ ఎంపీపీ దాడి వరలక్ష్మి అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఐపీఎం హెచ్ఆర్ కాన్ఫరెన్స్ బ్రోచర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉక్కు డైరెక్టర్ పాండే, ఎన్ఐపీఎం ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 31: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం) సెంట్రల్ రీజియన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 26న స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించనున్న హెచ్ఆర్ కాన్ఫరెన్స్ బ్రోచర్‌ను ఆదివారం స్టీల్‌ప్లాంట్‌లో డైరెక్టర్ (పర్సనల్) ఎస్సీ పాండే, ఎన్ఐపీఎం రీజనల్ ఉపాధ్యక్షుడు బి.శేషగిరి రావు, కార్యదర్శి డాక్టర్ మురళీధర్‌రావులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఈ కాన్ఫరెన్స్ సెషన్‌లను హ్యూమన్ రీసోర్సెస్ పరిశ్రమకు చెందిన నిపుణులు, ప్రముఖ విద్యావేత్తలు, హెచ్ఆర్ నిపుణులు నిర్వహిస్తారని, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు చెందిన హెచ్ఆర్ నిపుణులు ప్రతినిధులుగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉక్కు అధికారులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణ దానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఉక్కు జీఎం ఉద్దం నాగ్, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 31: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న కొందరికి ప్రాణదానం చేసిన వారవుతామని స్టీల్‌ప్లాంట్ జీఎం (బీఎఫ్) ఉద్దం నాగ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సమితి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. సత్యసాయి సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. సమితి కన్వీనర్ రామకృష్ణ, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

వాలీబాల్ జాతీయ స్థాయి విజేతకు అభినందనలు



ఆటోనగర్, మార్చి 31: రాజస్థాన్ నిమ్స్ యూనివర్సిటీలో పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో మార్చి 29, 30 తేదీల్లో జరిగిన 12వ సీనియర్ మెన్ అండ్ వుమెన్ సిట్టింగ్ వాలీబాల్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో నగరంలోని 70వ వార్డు చిట్టినాయుడు కాలనీకి చెందిన సరోజినీ యాదవ్ మంచి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఆమె క్రీడాస్ఫూర్తికి కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలు

పెదగంట్యాడ, మార్చి 31: పుస్తకాలు చదవడం వల్ల భాషపై పట్టు పెరుగుతుందని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన గ్రంథాలయంలో పలువురు చిన్నారులతో పలు పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలు చదివే అలవాటు ఉంటే విజ్ఞానం పెరగడంతో పాటు వారికి భాషపై మంచి పట్టు వస్తుందన్నారు. నడుపూరు జెడ్పీ హైస్కూల్, నెల్లిముక్కు మోడల్ యూపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఎంవీపీ కాలనీ, మార్చి 31: నగరంలోని విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీపీలోని ఓ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో 30 రోజులు ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. ఇది టెన్త్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వివరాలకు 9848418582 ఫోన్ నంబరును సంప్రతించాలని కోరారు.

వ్యాయామంతో ఆరోగ్యం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మురళీనగర్, మార్చి 31 ; రోజూ వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని న్యూరాలజిస్ట్ జి.రమేష్ తెలిపారు. నిత్యం నడకతోపాటు మంచి ఆహార నియమాలను పాటిస్తే పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్ వంటి తీవ్ర సమస్యలను నియంత్రించవచ్చని సూచించారు. ఆదివారం మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో అపోలో ఆసుపత్రి వైద్య సిబ్బంది సాయంతో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను వైద్యులు జి.రమేష్, ఎం.మౌనిక, యూరాలజిస్ట్ జి.శాంతి వైద్య పరీక్షలు చేశారు. రోజూ తగినంత నీరు తాగడంతో కిడ్నీలో రాళ్ల సమస్యలు తలెత్తకుండా చూసుకోవచ్చని, వడదెబ్బకు దూరంగా ఉండొచ్చని పేర్కొన్నారు. శిబిరంలో 142 మందికి బీపీ, షుగర్, ఈసీజీ తదితరవైద్య పరీక్షలు చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పల్లా.చంద్రమౌళి, ఉపాధ్యక్షులు ఎ.వి.సుబ్బారావు, కోశాధికారి జె.కూర్మారావు, క్లబ్ కార్యవర్గ సభ్యులు సహకరించారు.

పూర్తిస్థాయిలో విద్యా హక్కు చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట, మార్చి 31: ఆరు నుంచి 14 ఏళ్లలోపు బాలలకు ఉచిత విద్యనందించే చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరమ్, బాల వికాస్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు కోరారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం, బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా హక్కు చట్టం 15 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో నరవ ప్రకాశరావు మాట్లాడారు. విద్యా హక్కు చట్టం పూర్తి స్థాయి లో అమలు చేయడం ద్వారా బాలలకు భరోసా ఇవ్వగలమన్నారు. అదే విధంగా చట్టం అమలు తీరుపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యా హక్కు చట్టం పుస్తకాన్ని ప్రదర్శించి వివరాలు తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ పీకే జోష్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ గౌరీశంకర్, రమణ, హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లో వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తుందంటూ ఫిర్యాదు

సీతమ్మధార, మార్చి 31: ఎన్నికలు ముగిసేంత వరకు సంక్షేమ పథకాలు ఆపేయాలని, పింఛన్లు కూడా వలంటీర్లు పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిన ఉత్తర్వులను కాదని వైసీపీ వాట్సాప్ గ్రూప్‌లో ప్రచారం చేస్తుందంటూ కలెక్టర్ మల్లికార్జునకు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు ఫిర్యాదు చేశారు. పింఛన్లు పంపిణీకి తాము సిద్ధమని, కానీ, టీడీపీ శ్రేణులు ఇందుకు అడ్డుతగులుతున్నారంటూ వాట్సాప్‌లో వైసీపీ ప్రచారం సాగిస్తోందని కలెక్టర్‌కు ఆయన వివరించారు. ఈమేరకు నగరంలోని వలంటీర్ల గ్రూపులు, సీవోలు, యూసీడీ సిబ్బంది వాట్సప్‌ల్లో వైరలవుతున్న మెసేజ్‌లను కలెక్టర్ దృష్టికి విష్ణుకుమార్‌రాజు తీసుకువెళ్లారు.

నేటి నుంచి కేవీలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

అక్కయ్యపాలెం, మార్చి 31: తాటిచెట్లపాలెంలోని కేంద్రియ విద్యాలయంలో బాలవాటిక, మొదటి తరగతి ప్రవేశాల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్టు ప్రిన్సిపాల్ కమల్‌జిత్ తెలిపారు. ఈ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో వచ్చేనెల 15వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులు తొలి జాబితా ఏప్రిల్ 19న, రెండో జాబితా 29న, ఇంకా సీట్లు మిగిలితే మే 8న ప్రకటిస్తామన్నారు. 2 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి ఆఫ్‌లైన్‌లో పదో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించున్నట్లు చెప్పారు. తుది జాబితా 15న ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు కేంద్రియ విద్యాలయ సంఘటన్ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

ప్రజాశాంతి పార్టీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఏ పాల్

అక్కయ్యపాలెం, మార్చి 31: ప్రజాశాంతి పార్టీలో గాజువాక నుంచి పలువురు చేరారు. వీరికి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ రైల్వేన్యూకాలనీలో కార్యాలయంలో ఆదివారం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ అభివృద్ధితోపాటు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగాలన్నా ఎంపీగా తనను గెలిపించాలన్నారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దేశాన్ని పరిరక్షించే సత్తా తనకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నేతలు జిలుకర రవికుమార్, కో ఆర్డినేటర్ బాబోజీరావు, కాకినాడ ఈశ్వరరావు, ఎం.యూన్సీ పాల్గొన్నారు.

దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక

- కూటమి అభ్యర్థి వంశీకృష్ణ
- 34వ వార్డులో ప్రచారం



34వార్డులో ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

అల్లిపురం, మార్చి 28: విశాఖ దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి బృహత్తర ప్రణాళికతోముందుకు సాగుతున్నట్టు జనసేన నాయకుడు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీ కృష్ణ అన్నారు. ఆదివారం 34వవార్డు అచ్చియ్యమ్మపేట వద్ద నుంచి టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీతో కలిసి ఆయన ఎన్నికలప్రచారం నిర్వహించారు. ముందుగా నీలమ్మఅమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత నీలమ్మ వేపచెట్టు, కుమ్మరివీధి, అమ్మవారివీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రానున్న ఉమ్మడి ప్రభుత్వం చేయనున్న అభివృద్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ, ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చుతామని హామీ ఇచ్చారు. వ్యాపారులను కలిసి మద్దతు కోరారు. గత పదేళ్లుగా అభివృద్ధిని విస్మరించిన వాసుపల్లికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మోసాలను మరోసారి నమ్మే స్థితిలేదన్నారు. విశాఖపార్లమెంటు అభ్యర్థి భరత్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు వాసుపల్లి రామ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి పి. రాజేశ్వరి, దాసన సత్యనారాయణ, రాజు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ పోరుతోనే పోర్టు ఫెర్రీ కాలువల్లో పూడిక పనులు: గండిబాబ్జీ

జగదాంబ కూడలి: తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు పోరాటంతోనే జీవీఎంసీ అధికారులు పోర్టు ఫెర్రీ కాలువల్లో పూడికలను తొలగించే చర్యలు చేపట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. ఆదివారం కోటవీధి ఫెర్రీ రోడ్డులో కాలువల్లో పూడికతీత పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు ఈసందర్భంగా జోనల్ అధికారులకు పనులకు సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గఫూర్ (లడ్డూ), ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో సేఫ్టీ ఆఫీసర్స్ బాధ్యత చాలా కీలకం

- జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివ శంకర్ రెడ్డి



ఉత్తీర్ణులైన అభ్యర్థులతో శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ

కంచరపాలెం, మార్చి 31: పరిశ్రమల్లో సేఫ్టీ ఆఫీసర్స్ బాధ్యతలు చాలా కీలకమని విశాఖపట్నం చీఫ్ జాయింట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం సేఫ్టీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శివశంకర్ రెడ్డి మాట్లాడారు. సేఫ్టీ కోర్సులు పరిశ్రమల్లో అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉంటాయన్నారు. పరిశ్రమల్లో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం కలగకుండా జాగ్రత్త తీసుకోవడంలో సేఫ్టీ అధికారులు ఎంతో బాధ్యతతో వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలోనే సేఫ్టీ కోర్సుల శిక్షణను అందిస్తున్న ప్రభుత్వ కెమికల్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులను అభినందించారు. అనంతరం ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ మాట్లాడుతు సేఫ్టీ కోర్సుల శిక్షణ హబ్‌గా కెమికల్ కళాశాల నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డా.బీవీ లక్ష్మణరావు, కరికులం కో ఆర్డినేటర్ ఏ వరహాలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు: ఆర్‌వో



ఉత్తర నియోజకవర్గ ఆర్‌వో అఖిల

సీతమ్మధార, మార్చి 31: ఎన్నికల సంఘం ఆదేశాలను ఉల్లంఘించి వార్డు వలంటీర్లు రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొరాదని ఉత్తర నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి డి.అఖిల తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె ఆదివారం మాట్లాడారు. ప్రజలకు అందించే పింఛన్లు సహాఇతర నగదు పంపిణీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. అందుకువిరుద్ధంగావలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు.

జగన్నాటకంలో డీఎస్సీకి బ్రేక్

- సీఎం జగన్ ఉద్దేశించి మాజీ మంత్రి గంటా ట్విట్టర్‌లో విమర్శ

అక్కయ్యపాలెం, మార్చి 31: ఎన్నికల ముందు ఇచ్చిన జగన్నాటకంతోనే డీఎస్సీ ప్రక్రియకు బ్రేక్ పడిందని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్‌లో విమర్శించారు. అంతా ఆయన అనుకున్నట్లే, ఆయనకు తెలిసే ఇదంతా జరిగిందని ఆరోపించారు. ఐదేళ్లపాటు నిద్రపోయి, ఎన్నికల ముందు కోడ్ వస్తుందని తెలిసినా అడ్డగోలు నిబంధనలతో డీఎస్సీ ప్రకటన ఇచ్చారని పేర్కొన్నారు. నిరుద్యోగులు టెట్, డీఎస్సీ కోసం శిక్షణ కోసం వేలాది రూపాయలు ఖర్చుచేశారన్నారు. ప్రభుత్వం డీఎస్సీ అంటూ హడావుడి చేసి నిరుద్యోగుల నుంచి కోట్లాది రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేసిందని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేసిన ఈకుట్ర ప్రతి నిరుద్యోగికీ అర్థమైందని, ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని గంటా పేర్కొన్నారు. త్వరలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఈసారి తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పైనే పెడతారన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనతో ముఖ్యమంత్రిగా ఎనిమిది సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. 2014లో 9,061 పోస్టులు, 2018లో 7,729 పోస్టుల భర్తీతో వేలాదిమంది నిరుద్యోగుల కుటుంబా ల్లో వెలుగు నింపారన్నారు.

ఢిల్లీ బోణీ

... 3వ పేజీ తరువాయి

చేసింది. వరుసగా వికెట్లు పడిపోయి స్కోరు మందగించిన సమయంలో 13వ ఓవర్‌లో జడేజా బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా పంత్ భారీ సిక్సర్ కొట్టాడు. పతిరాణా బౌలింగ్‌లో స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీ కొట్టిన మార్ష్ (18), తర్వాత బంతికి క్లీన్ బౌల్డ్ కాగా, మార్ష్ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన స్టబ్స్ (0) పరుగులేమీ చేయకుండానే అవుటయ్యాడు. కాగా 18వ ఓవర్‌లో రిషబ్ పంత్ చెలరేగాడు. పతిరాణా బౌలింగ్‌లో లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, బౌండరీ, పాయింట్ మీదుగా మరో బౌండరీ కొట్టి ప్రేక్షకులను ఉత్సాహపరిచి (50), 31 బంతుల్లో నాలుగు బౌండరీలు, సిక్సర్లతో అర్ధ సెంచరీ పూర్తి చేసి ఐదో వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 191 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ తుది జట్టులో లోకల్ బాయ్‌కు రిక్కీబుయ్‌కు చోటు దక్కలేదు. లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 171 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఏడు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన దశలో రహానే (45), మిచెల్ (34) జట్టును ఆదుకున్నారు. దుబే (18) కొద్ది సేపు మెరిశాడు. వరుసగా వికెట్లు పడిపోయిన దశలో ధోనీ బ్యాటింగ్‌కు దిగడంతో ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. మూడు సిక్సర్లు, ఒక బౌండరీతో 37 పరుగులు చేసిన ధోనీకి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ రెండు, ముకేష్‌కుమార్ మూడు వికెట్లు పడగొట్టారు.

మా హయాంలో 14,200 టీచర్ పోస్టులు భర్తీ చేశాం

- రాష్ట్ర విద్యా శాఖమంత్రి బొత్స



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2019లో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత 14,200 మందికి ఉపాధ్యాయ పోస్టింగ్‌లు ఇచ్చామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. నగరంలోని లాసెన్స్‌బే కాలనీ బీచ్‌రోడ్డులో వైసీపీ లోక్‌సభ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి ఇటీవల ప్రారంభించిన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం డీఎస్సీ విడుదల చేసి, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభించినప్పటికీ పోస్టింగులు మాత్రం ఇవ్వలేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి డీఎస్సీలో ఎంపికైన 14,200 మందికి పోస్టింగ్‌లు ఇచ్చామన్నారు. ఈ కారణంగానే ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఏర్పడకపోవడంతో డీఎస్సీ నిర్వహించాల్సిన అవసరం రాలేదని చెప్పుకొచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అయ్యే ఖాళీలను లెక్కించి 6,100 పోస్టులతో డీఎస్సీని ప్రకటించినా,ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేసి అడ్డుకున్నారన్నారు. ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని డీఎస్సీ ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి బొత్స అన్నారు. ప్రస్తుత ఎన్నికల తర్వాత ప్రజల నుంచి తిరుగుబాటు, తిరస్కరణ వస్తుందనే భయంతోనే లోకేశ్‌కు భద్రత కోసం బీజేపీతో చంద్రబాబు పొత్తుపెట్టుకున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై బీజేపీ ఇప్పుడు కచ్చితంగా ప్రకటన చేయాలని, ఆ తర్వాతే కూటమి ఎన్నికల ప్రచారం ప్రారంభించాలని మంత్రి బొత్స డిమాండ్ చేశారు. బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ, విశాఖలో పుట్టిపెరిగిన తనకు పుట్టిన నేలకు సేవ చేసే అవకాశం ఇన్నాళ్లకు దొరికిందన్నారు. విశాఖ ఎంపీగా ఒకసారి అవకాశం దక్కితే రాష్ట్రాభివృద్ధికి విశాఖను గ్రోత్‌ఇంజన్‌గా తయారు చేస్తానన్నారు.

ముగిసిన 'ట్రయంఫ్' విన్యాసాలు



సీ ఫేజ్ విన్యాసాల దృశ్యం

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భారత్, అమెరికన్ నేవీ మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో భాగంగా ఎక్స్ టైగర్ ట్రయంఫ్ పేరుతో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న విన్యాసాలు శనివారంతో ముగిశాయి. ఇరు దేశాలు రెండు దశల్లో ఈ విన్యాసాలను నిర్వహించారు. ఈనెల 18 నుంచి 25 వరకు హార్బర్ ఫేజ్ విన్యాసాలను నిర్వహించగా, రెండో దశలో సీఫేజ్ విన్యాసాలను ఈనెల 26 నుంచి 30 వరకు నిర్వహించారు. ముగింపు విన్యాసాల్లో భారత్‌కు చెందిన లాండన్ ప్లాట్‌పార్మ్ డాక్, లాండింగ్ షిప్ ట్యాంక్స్ భాగస్వామ్యమయ్యాయి. ల్యాండింగ్ ఎయిర్ క్రాఫ్ట్, హెలికాప్టర్స్‌తో విన్యాసాలు నిర్వహించారు. విన్యాసాల్లో ఇండియన్ ఆర్మీకి చెందిన బృందాలు భాగమయ్యాయి. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన మీడియం ఎయిర్‌క్రాఫ్ట్, ట్రాన్స్‌పోర్ట్ హెలికాప్టర్, రాపిడ్ యాక్షన్ మెడికల్ టీమ్ ఈ విన్యాసాల్లో పాల్గొంది. అమెరికా నేవీకి చెందిన హెలికాప్టర్స్, డెస్ట్రాయర్స్ వంటివి కూడా పాలుపంచుకున్నాయి.

ఏ రాజకీయ పార్టీకి 'నాగవంశీయులు మద్దతు లేదు'

జగదాంబ కూడలి, మార్చి 31: దక్షిణ నియోజకవర్గ పరిధిలో నాగవంశ సామాజిక వర్గం ఏ రాజకీయ పార్టీ కి మద్దతు తెలపడంలేదని గ్రేటర్ 30వ వార్డు కుమ్మరవీధి ఆంధ్రా నాగ వంశ సంక్షేమ సంఘం కమిటీ ప్రతినిధులు డి.సత్యనారాయణ, కాళ్ల కిరణ్, రాజు, నాని స్పష్టంచేశారు. తమ సామాజిక వర్గానికి చెందిన కొందరు స్వార్థరాజకీయాలతో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేశ్‌కుమార్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటనలు చేయడం తగదని వారన్నారు.

కప్పరాడలో కత్తులతో యువకులు హల్‌చల్

- పాత తగాదాల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కంచరపాలెం, మార్చి 31: కంచరపాలెం పరిధి కప్పరాడ ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఆదివారం కొంత మంది యువకులు కత్తులతో హల్‌చల్ చేసి స్థానికులను భయభ్రాంతులకు లోనుచేశారు. వివరాలివి.. కంచరపాలెం కప్పరాడ, జైప్రకాశ్ నగర్‌లకు చెందిన ఇరువర్గాల మధ్య పాత తగాదాలు నేపథ్యంలో ఆదివారం ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో దివ్యతేజ, మహేష్, మదన్ అనే యువకులపై గణేశ్ వర్గానికి చెందిన వ్యక్తులు కత్తులతో దాడి చేసినట్టు సమాచారం. ఈ ఘర్షణలో గణేష్‌తో పాటు ఆయన ఇద్దరు మేనల్లుళ్లు దాడిలో పాల్గొని అవతలి వర్గానికి చెందిన దివ్యతేజ, మహేశ్, మదన్‌పై దాడి చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం బాధితులను కేజీహెచ్‌కు స్థానిక పోలీసులు తరలించారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘర్షణకుసంబంధించి పూర్తి వివరాలుతెలియాల్సి ఉంది.

వన్‌టౌన్‌లో గ్యాంగ్ వార్..: యువతి కోసం కొట్లాట

జగదాంబ కూడలి, మార్చి 31: వన్‌టౌన్ రెల్లివీధి పరిధిలో గ్యాంగ్‌వార్ చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ భాస్కర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ యువతి విషయంలో ఇరువర్గాల మధ్య ఈఘటన చోటుచేసుకున్నట్టు సమాచారం. ఈ వ్యవహారంలో ఒక వర్గంపై మరొక వర్గం కత్తులు దూసింది. విషయం వన్‌టౌన్ పోలీసులకు చేరడంతో పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ ఇరువర్గాలు రౌడీషీటర్ లిస్ట్‌లో పేర్లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు ఇరువర్గాలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌న్ తరలించారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు సీఐ వెల్లడించారు. రెల్లివీధిలో ఈఘటనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో స్థానికులు ఆందోళనకు లోనయ్యారు. పోలీసులు రంగ ప్రవేశంతో పరిస్థితి అదుపులోకి రావడంతో ఊపిరిపీల్చుకున్నారు.

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు జ్ఞానాపురంలోని జూబ్లీ హైస్కూలులో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాలకు చెందిన 1.80 లక్షల జవాబుపత్రాలు విశాఖకు కేటాయించారు. మూల్యాంకనం కోసం 1000 మంది టీచర్లను నియమించగా, అనకాపల్లి నుంచి అదనంగా మరో 120 మంది ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకోనున్నారు. జూబ్లీ హైస్కూల్‌లో మొత్తం 26 గదుల్లో జరిగే మూల్యాంకనం రెండు బ్లాకులుగా విభజించారు. డీఈవో ఎల్. చంద్రకళ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. ఈ బ్లాకులకు డైట్ సీ నియర్ లెక్చరర్లు మాణిక్యాలనాయుడు, గౌరీశంకర్ డిప్యూటీ క్యాంపు అధికారిగా, జిల్లాపరీక్షల విభాగం సహాయ కమిషనర్ మురళీ స్ట్రాంగ్‌రూమ్ వద్ద డిప్యూటీ క్యాంపు అధికారిగా విధులు నిర్వర్తిస్తారు. వన్‌టౌన్‌లోని క్వీన్ మేరీస్ హైస్కూల్‌లో అనేకఏళ్లుగా మూల్యాంకనం నిర్వహించినఅధికారులు తొలిసారిగా జూబ్లీ స్కూలుకు ఈ ఏడాది మార్చారు.

కొత్తపాలెంలో వన్య ప్రాణులు స్వాధీనం

- పోలీసుల అదుపులో పెంపుడు జంతువులు విక్రయించే వ్యాపారి



నెమలి పిల్లలు, నక్షత్ర తాబేళ్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐలు

గోపాలపట్నం, మార్చి 31: పెంపుడు జంతువులు విక్రయించే ఓ వర్తకుడి వద్దనుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పలు వన్యప్రాణులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. కొత్తపాలెంలోని సంతోశ్‌నగర్ కాలనీకి చెందిన పిల్లా నాగేశ్వరరావు పెంపుడు జంతువులను విక్రయిస్తుంటాడు. అయితే, ఆయన వద్ద నిషేధిత వన్య ప్రాణులున్నట్టు సమాచారం అందడంతో ఏసీపీ ప్రసాద్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి ఆయన ఇంటిపై దాడి చేశారు. నాగేశ్వరరావు ఇంటి వద్దనున్న 15 నక్షత్ర తాబేళ్లు, రెండు నెమలి పిల్లలు, ఒక జింక కొమ్మును వారు స్వాధీనం చేసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా గాజువాక ప్రాంతానికి చెందిన గొందేసి శ్రీనివాసరావు అనే వర్తకుడి నుంచి నక్షత్ర తాబేళ్లు తీసుకున్నట్టు నాగేశ్వరరావు పోలీసులకు తెలిపాడు. అలాగే, కొద్ది రోజుల క్రితం నర్సీపట్నం నుంచి నెమలి గుడ్లు తీసుకువచ్చి, ఇంటి దగ్గర కోడితో పొదిగించగా రెండు పిల్లలు పుట్టడంతో వాటిని పెంచుకుంటున్నట్టు పేర్కొన్నాడు. ఈ విషయంపై పోలీసులు విచారణ సాగిస్తున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న వన్య ప్రాణులను అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్నట్టు ఎస్‌ఐ వి.అప్పలనాయుడు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ మల్లేశ్, ఎస్‌ఐ భరత్ కుమార్ రాజు పాల్గొన్నారు.

సినీ 'మాయ'!

... 3వ పేజీ తరువాయి

చూసి, ఆ వివరాలతో ఖాతాల్లోని నగదుని కొల్లగొట్టేస్తున్నారు. బ్యాంకు నుంచి బాధితులకు ఓటీపీ కూడా రాకుండా నోటిఫికేషన్‌ను మ్యూట్‌లో పెట్టేస్తున్నారు. నగరంలో ఇటీవల ఈతరహా మోసాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

ఆ వెబ్‌సైట్ల జోలికి వెళ్లొద్దు



ఇంటర్నెట్‌లో ఉచితంగా సినిమాలు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉన్న వెబ్‌సైట్ల జోలికి వెళ్లపోవడమే మంచిది. ఉచితంగా ఎవరైనా ఎందుకు ఇస్తారు? ఏదో ప్రయోజనం ఉంటేనే ఆ సదుపాయం కల్పిస్తారనేవిషయాన్ని గుర్తించాలి.అన్నివెబ్‌సైట్లుసైబర్‌నేరగాళ్ల నియంత్రణలో ఉండకున్నా, చాలా వెబ్‌సైట్లు వారే రూపొందించి వారి నియంత్రణ లోనేఉంచుకుంటారు. చాలామంది కొత్తసినిమాలు, పోర్న్ వెబ్‌సైట్లలోకి వెళ్లి తమ బ్యాంక్ ఖాతాల్లోని డబ్బులు పోగొట్టుకుంటున్నారు. ఇలాంటి ఫిర్యాదులు ఇటీవల పెరుగుతున్నాయి. దీనిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి.

- కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ

ఆశలు అవుట్!

... 3వ పేజీ తరువాయి

25 వేల మంది అవుట్ సోర్సింగ్, మరో ఐదు వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని మండిపడుతున్నారు.

ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీలతో ఆశలు పెట్టుకున్నామని, వేతనాలు పెరిగి జీవితాలు బాగుపడతాయని భావించామని, తీరా ఐదేళ్లు గడిచినా ఒక్కటి కూడా అమలుకాక ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు. జగన్ ఇచ్చిన హామీల అమలుకోసం ఐదేళ్లుగా నేతల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో దాదాపు 70 శాతం మంది ఆరోగ్యశాఖలో పని చేస్తుండగా, మిగిలిన 30 శాతం మంది జీవీఎంసీ, ఫారెస్ట్, సమగ్ర శిక్ష అభియాన్, పశు సంవర్ధక శాఖల్లో పనిచేస్తున్నారు.

హామీ అమలుకు మంగళం

సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేసి ఉంటే జిల్లాలో 30 వేల మందికిపైగా ఉద్యోగులకు మేలు జరిగేది. ప్రస్తుతం కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు రూ.18 వేల నుంచి రూ.38 వేల వరకు వేతనం లభిస్తోంది. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి ఉంటే.. రెగ్యులర్ ఉద్యోగులకు లభించే వేతనం దక్కేది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.24 వేలు చెల్లిస్తున్నారు. కనీస వేతనాల హామీ అమలైతే రూ.30 వేలకుపైగా లభించేదని చెబుతున్నారు. అదే సమయంలో ఈ రెండు కేటగిరీల్లో ఉద్యోగ భద్రత ఉండేదంటున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలయ్యేదని పేర్కొంటున్నారు.

కేంద్ర పథకమంటూ దాటవేత

కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని అమలుచేయాలని ఉద్యోగులు కోరితే.. ప్రభుత్వ పెద్దలు భిన్నమైన వాదనను తెరపైకి తీసుకు వచ్చారని చెబుతున్నారు. సమగ్ర శిక్ష అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్ వంటి స్కీమ్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుచేస్తున్నాయని, వీటిలో పనిచేసే వారిని రెగ్యులరైజ్ చేయలేమని ప్రభుత్వం స్పష్టం చేసిందంటున్నారు. పాదయాత్ర సమయంలో ఈ అంశాలపై జగన్‌కు అవగాహన ఉన్నప్పటికీ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత మాట మారుస్తున్నారని ఉద్యో గులు మండిపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమలుచేస్తున్న పథకాల్లోనే సుమారు నాలుగు వేల మంది వరకు కాంట్రాక్టు ఉద్యోగులున్నారని, వారందరినీ మభ్య పెట్టి.. ఈ తరహా వ్యాఖ్యలు చేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నమ్మించి మోసం చేశారు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మేలు చేస్తామని ఇచ్చిన హామీని అమలుచేయకుండా నమ్మించిమోసం చేశారు. ఐదేళ్లుగా ప్రభుత్వ ప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. ఉద్యోగులకు భద్రత, ఇతర బెనిఫిట్స్ అందిస్తామని ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారు. కేంద్ర పరిధిలోని స్కీమ్ అంటూ అడ్డగోలు వాదనను తెరపైకి తీసుకురావడం దారుణం. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 30 వేల మందిఉద్యోగులకు ఈ ప్రభుత్వం అన్యాయం చేసింది.

-పి.మణి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ

ప్రచారంలోనే వలంటీర్లు

... 3వ పేజీ తరువాయి

పాల్గొనడం వల్ల అధికారులు ఇప్పుడు తొలగించినా, అధికారంలోకి వస్తే మళ్లీ తీసుకుంటామని భరోసా ఇస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితిలో అధికారపార్టీ అభ్యర్థులకు మద్దతుగా వలంటీర్లు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.


ఇలా పాల్గొన్నవారిపై విపక్ష నేతలు అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదులు చేస్తుండడంతో వారిని విధుల నుంచి తొలగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకూ ఎన్నికల ప్రచారం పాల్గొన్నారనే అభియోగంపై 22 మంది వలంటీర్లను అధికారులు తొలగించారు. వీరిలో జోన్-3 పరిధిలో ముగ్గురు, జోన్-6 పరిధిలో ఆరుగురు, జోన్-5 పరిధిలో ముగ్గురు, జోన్-4 పరిధిలో ఒకరు, జోన్-8 పరిధిలో ఒకరు, పద్మనాభం మండలంలో ఏడుగురు, భీమిలి మండలంలో ఒకరు ఉన్నారు. మరో తొమ్మిది మంది స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తొలగించిన వలంటీర్లలో ఎనిమిది మందిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వీరితోపాటు 52వ వార్డుకి చెందిన రిసోర్స్‌పర్సన్ ఒకరు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో ఆమెపై కూడా కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

... 3వ పేజీ తరువాయి

సోమవారం వస్తుందంటున్నారు. ఆ వెంటనే సచివాలయ ఉద్యోగులకు డబ్బు అందజేస్తారు. ఎన్నికల నేపథ్యంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియకు వలంటీర్లను దూరం పెట్టడంతో ఆ బాధ్యతను సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. దీంతో సగటున ఒక్కో ఉద్యోగికి పది నుంచి 15 మంది వలంటీర్లు పంపిణీ చేసే మొత్తాన్ని అందిస్తారు. ఏప్రిల్, మే పింఛన్లను సచివాలయంలో మాత్రమే పంపిణీ చేసేలా సెర్ప్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. పింఛనుదారులు ఆధార్‌కార్డు, లేదా ఇతర గుర్తింపుకార్డు తీసుకురావాలని సూచించారు. కాగా వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, బయోమెట్రిక్ యంత్రాలను స్వాధీనం చేసుకోవాలని ఎన్నికల సంఘం నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలందాయి.ఆదివారం సెలవుకావడం తో సోమవారం వాటిని స్వాధీనం చేసుకుని సచివాలయ సిబ్బందికి అందజేస్తామని ఓ అధికారి వివరించారు.

బీసీల ద్రోహి జగన్



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మహారాణిపేట, మార్చి 31: బీసీ అభివృద్ధి తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమితోనే సాధ్యమని ఉత్తరాంధ్ర బీసీ రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు రాజు గౌడ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ బీసీల ద్రోహి అని, రాష్ట్రంలో బీసీ వర్గాలను విడగొట్టి అణచివేతకు లోనుచేస్తున్నారన్నారు. బీసీ యువత ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారన్నారు. ప్రజలుఅప్పులు పాలవుతున్నారన్నారు. దక్షిణ నియోజకవర్గం అభివృద్ధి జనసేన నేత వంశీకృష్ణ శ్రీనివాస్‌తోనే సాధమన్నారు.

ప్రతిపక్షాలపై బీజేపీ కక్ష సాధింపు వైఖరి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి



అంబేడ్కర్ విగ్రహంవద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

డాబాగార్డెన్స్, మార్చి 31: ప్రతిపక్ష పార్టీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. ఆదివారం డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆమ్‌ఆద్మీ, సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్ల అంశం బయటకు రాగానే, దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. ప్రధాని మోదీ, అమిత్‌షాల దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పాలన్నారు. నాయకులు ఎం.పైడిరాజు, రమేష్, సీతల్, సుధాకర్, కృష్ణారావు, లలిత, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలి సెట్‌కు ఉచిత శిక్షణ

భీమునిపట్నం, మార్చి 31 : పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు సోమవారం నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1 నుంచి 24 వరకూ తమ కళాశాలలో తరగతులు జరుగుతాయన్నారు. పరీక్షకు అవసరమైన మెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తామని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారితో పాటు పరీక్షలు రాసిన వారు కూడా శిక్షణకు హాజరుకావచ్చునని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ తరగతులు జరుగుతాయని, ఆసక్తి గల వారు కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఎంవీపీ కాలనీ, మార్చి 31 : నగరంలోని విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంవీపీలోని ఓ కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో 30 రోజులు ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. ఇది టెన్త్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు 9848418582 ఫోన్ నంబరును సంప్రతించాలని ఆయన సూచించారు.

గీతం విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరం

సాగర్‌నగర్, మార్చి 31 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం మారనత చిల్డ్రన్ హోమ్‌లో పలు సేవలు నిర్వహించారు. మానసిక వికలాంగులతో ఆటలు ఆడించి, పాఠాలు బోధించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాజా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుమంతో మండల్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిని రక్షించిన లైఫ్‌గార్డులు


యువకులతో లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, మార్చి 31 : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానానికి దిగిన ఇద్దరు యువకులను లైఫ్‌గార్డులు రక్షించారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు మిత్రులు రాజు (26), సునీల్‌కుమార్ (25) ఆదివారం రుషికొండ బీచ్‌కు విహార యాత్రకు వచ్చారు. ఇద్దరూ సముద్రంలో స్నానాలకు దిగగా పెద్ద కెరటం తాకిడికి చెల్లాచెదురై కొట్టుకుపోతుండగా సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న లైఫ్‌గార్డులు గమనించి, వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్యాలు

మధురవాడ, మార్చి 31 : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో నగరానికి చెందిన నవ్య డ్యాన్స్ అకాడమీ కళాకారులు ఆదివారం శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు.కళాకారులు పద్మావతి, అంజలి, శృతి, మేఘన, నిషిత, వర్షిత తదితరులు పలు కీర్తనలకు నృత్యరీతులు సమకూర్చారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మద్దిలపాలెం, మార్చి 31 : మద్దిలపాలెం జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున లారీ బోల్తా పడింది. మద్దిలపాలెం నుంచి ఇసుకతోట వైపు వెళ్తున్న లారీ హోండా యాక్టివా షోరూమ్ ఎదురుగా అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో పక్కన ఎటువంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్, క్లీనర్ చిన్న చిన్న గాయాలతో బయటపడ్డారు. ఎంవీపీ కాలనీ ట్రాఫిక్ పోలీసులు వెంటనే స్పందించి క్రేన్ సహాయంతో లారీని రోడ్డు పక్కకు నెట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగలేదు.

తగ్గిన జూ ఆదాయం

ఆరిలోవ, మార్చి 31 : నగరంలోని జూపార్కుకు ఆదివారం సందర్శకుల తాకిడి తగ్గింది. సుమారు 2782 మంది పర్యాటకులు జూకు రాగా వారి వద్ద నుంచి రూ. 2.30 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.

సినిమా గైడ్

- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శారద, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్, మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి)
- **ఆడుజీవితం :** శ్రీలీలామహల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఓం భీం బుష్ :** సంగం, కామేశ్వరి, రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **ప్రేమలు :** శ్రీకన్య, దుర్గ (మధురవాడ), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 18, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 22, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 150, బరబటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 30, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 160, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 54, ఆగాకర 52, పొటల్స్ 46, కీరదోస 24, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..

టీడీపీ పాలనతో చిరు వ్యాపారులకు మేలు

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


టిఫిన్ దుకాణంలో దోసె వేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, మార్చి 31 : చిరు వ్యాపారులకు మేలు చేకూర్చేది తెలుగుదేశం పార్టీ అని తూర్పు టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఆదివారం ఆయన 18 వార్డులోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ పాలనలో చిరు వ్యాపారులకు ఊతమిచ్చేలా ఆదరణ వంటి పథకాల ద్వారా వృత్తి ఆధారిత సామగ్రి అందజేసినట్టు గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఓ టిఫిన్ సెంటరులో తాను సరదాగా దోసె వేసి, వినియోగదారులకు అందించారు. కార్పొరేటరు మంగవేణి పోలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.కాగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, తదితరులు డాక్టర్స్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందించారు. ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి పోతనరెడ్డి, సత్తిబాబు, జీవిత, లక్ష్మీ, శివ, నరేంద్ర, వాసు పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెంలో..

విశాలాక్షినగర్ : టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబును ఎన్నికల్లో గెలిపించాలని ఆయన సతీమణి వెలగపూడి సుజన కోరారు. ఆదివారం ఆమె 9వ వార్డులోని జోడుగుళ్లపాలెంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీతోనే రాష్ట్ర దశ, దిశా మారుతుందని, మహిళందరూ సైకిల్ గుర్తుకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మైలపల్లి శ్రీను, గరికిన నూకరాజు, బీజేపీ విశాఖ పార్లమెంట్ మహిళా మోర్చా అధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.

సిరిపురం : వెలగపూడి రామకృష్ణబాబును గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి సుజన 28వ వార్డు పెకర్ లేఅవుట్ సహా పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఆరిలోవ : జీవీఎంసీ 10వ వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ ఆధ్వర్యంలో వెలగపూడికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి కేతా సత్యన్నారాయణ, జనసేన నాయకులు బండి రాజా రమేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ ఉత్సాహం

మధురవాడ, మార్చి 31 : పీఎం పాలెం క్రికెట్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చారు. సాయంత్రం ఐదు నుంచి ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతించడంతో అన్ని గేట్ల వద్ద క్యూ కట్టారు. వారాంతపు సెలవు కావడంతో చాలామంది కుటుంబాలతో సహా తరలివచ్చారు. దీంతో రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీ, మిథిలాపురి వుడాకాలనీ, ఎంవీవీ సిటీ, లా కళాశాల రహదారితో పాటు అన్ని రోడ్లలో సందడి కనిపించింది.

జోరుగా క్రీడా సామగ్రి విక్రయాలు

ఎండాడ : హనుమంతవాక నుంచి స్టేడియం వరకు జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుకాణాల్లో క్రీడాకారులకు సంబంధించిన సామగ్రికి గిరాకీ నెలకొంది. ఇరు జట్లకు చెందిన టీ షర్ట్‌లను రూ. 150 నుంచి రూ. 250 వరకు విక్రయించారు. క్యాప్‌లు రూ.100,హెడ్‌బ్యాండ్‌లు రూ. 20 ఇచ్చారు.

హెచ్‌బీ కాలనీలో రెండు బడ్డీలు దగ్ధం


బడ్డీల వద్ద ఎగిసిపడుతున్న మంటలు

వెంకోజీపాలెం, మార్చి 31 : జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీలోని సులబ్ కాంప్లెక్సు ఎదురుగా ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు బడ్డీలు దగ్ధమయ్యాయి.ఇక్కడ చెత్త డబ్బా వద్ద చెత్త వేసి ఎవరో నిప్పు పెట్టారు. ఎండలకు అప్పటికే బాగా ఎండిపోయి ఉన్న తుప్పలు, చెట్టు దుంగలకు మంటలు అంటుకుని వ్యాపించాయి. దీంతో చెత్తా డబ్బాకు ఆనుకుని ఉన్న బడ్డీలకు మంటలు వ్యాపించడంతో రెండు కాలిపోయాయి. మరో బడ్డీకి మంటలు వ్యాపించకుండా స్థానికులు అదుపు చేశారు. కాలిపోయిన రెండు బడ్డీల్లో ఎలాంటి సామగ్రి లేకపోవడంతో పెద్దగా నష్టం వాటిల్లలేదు. మూడో బడ్డీకి మంటలు వ్యాపించి ఉంటే భారీ ప్రమాదమే జరిగేది. ఆ బడ్డీలో చిన్న చిన్న వెల్డింగులు చేయటానికి రెండు గ్యాస్ సిలెండర్లు ఉంచారు. మంటలు వ్యాపించగానే స్థానికులు దుకాణదారులకు సమాచారం అందజేయగా వారి వెంటనే వచ్చి ఆ సిలెండర్లను బయటకు తీసేసారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


ఐఏఎస్ అధికారి రేవు ముత్యాలరాజు


క్రికెటర్ గంగూలి

సింహాచలం, మార్చి 31 : వరాహలక్ష్మీనృసింహస్వామిని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరబ్ గంగూలి, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి (ఐఏఎస్) రేవు ముత్యాలరాజు ఆదివారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఈఓ సింగల శ్రీనివాస మూర్తి ఆహ్వానం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.


గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

రజత గరుడ వాహనంపై అప్పన్నస్వామి

సింహాచలం, మార్చి 31 : వరాహలక్ష్మీనృసింహస్వామి రజత గరుడ వాహనంపై సింహగిరి మాడవీధుల్లో ఊరేగారు. శ్రీసుదర్శన నారసింహ మహాయజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామివారి తిరువీధి వైభవంగా జరిగింది. మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆస్థాన విద్వాంసుల నాదస్వారాలపనలు, సన్నాయి వాయిద్యాలు మోగుతుండగా, పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య తిరువీధి ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దారి పొడవునా భక్తులకు స్వామివారికి కొబ్బరి కాయలు, అరటిపండ్లు, పలు రకాల పుష్పమాలికలతో ఆహ్వానం పలికారు.

మొల్లి సన్యాసమ్మకు మాజీ మంత్రి గంటా నివాళి


సన్యాసమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గంటా శ్రీనివాసరావు

కొమ్మాది/భీమునిపట్నం (రూరల్), మార్చి 31 : టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు మాతృమూర్తి సన్యాసమ్మ ఇటీవల 5వ వార్డులోని బొట్టవానిపాలెంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పెద్ద ఖర్మ ఆదివారం నిర్వహించారు. భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్ర మంలో మొల్లి లక్ష్మణరావు, 5వ వార్డు కార్పొరేటర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు. కాగా గంటా శ్రీనివాసరావును జనసేన కార్యకర్తలు ఆదివారం విశాఖలోని ఆయన స్వగృహంలో కలిసి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు రోహిత్, మొగ్గయ్య, అశోక్, శ్రీనివాసరావు ఉన్నారు.


కృష్ణ కళాశాలలో బూత్‌లను పరిశీలిస్తున్న జేసీ అశోక్


పద్మనాభంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్రావు


ఎండాడ : మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

పోలింగ్ బూత్‌లలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు : జేసీ

మద్దిలపాలెం, మార్చి 31 : పోలింగ్ బూత్‌ల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జేసీ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. మన పోలింగ్ బూత్-మన ఓటు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన వీఎస్ కృష్ణ కళాశాలలో పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. కళాశాలలో ఎన్ని బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారు, వాటి పరిస్థితి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఓటు సద్వినియోగం చేసుకోండి : తహసీల్దార్

పద్మనాభం (రూరల్) : యువత ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవడంతో పాటు గ్రామీణ ప్రజలకు ఓటు ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించాలని తహసీల్దార్ ఎన్. వెంకటరావు చెప్పారు. ఆదివారం పలు గ్రామాల్లో నిర్వహించిన మన పోలింగ్ బూత్ - మన ఓటు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ, రచ్చబండల వద్ద బీఎల్‌వోల ఆధ్వర్యంలో ప్రజలకు ఓటు నమోదైన సంఖ్య, పోలింగ్ బూత్ చిరునామా వివరాలు తెలియజేశామని చెప్పారు. కొత్తగా ఓటు పొందిన యువత దాని విలువ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పదో వార్డులో కానరాని సిబ్బంది

ఆరిలోవ : జీవీఎంసీ 10వ వార్డులోని ఎస్‌బీజీ నగర్ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ బూత్‌నకు ఎన్నికల సిబ్బంది ఎవరూ రాలేదు. దీంతో ఓటర్లు చాలాసేపు అధికారుల కోసం వేచి చూసి వెనుదిరిగారు. 13వ వార్డులోని దీనదయాళపురంలో ఉన్న బూత్‌నకు బీఎల్ఓ మాత్రమే వచ్చారు. కానీ ఓటర్లు ఎవరూ రాలేదు. సమాచారం లోపం వల్ల పోలింగ్ బూత్‌ల వద్ద ఎవరూ రాలేదని పలువురు వ్యాఖ్యానించారు.

ఎండాడ పాఠశాలను సందర్శించిన ఆర్డీవో

ఎండాడ : ఎండాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మన పోలింగ్ బూత్-మన ఓటు కార్యక్రమాన్ని భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బూత్ లెవెల్ అధికారులతో మాట్లా డుతూ పోలింగ్ బూత్‌కి వచ్చే ఓటర్లకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ శాతం పెంచేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎండాడ ఎస్సీ కాలనీలో ఉన్న సామాజిక భవనాన్ని పరిశీలించారు.

భీమిలిలో మహిళా ఓటర్లే అధికం

మధురవాడ, మార్చి 31 : భీమిలి నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటముల్లో మహిళా ఓటర్లు కీలకం కానున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,56,481 కాగా మహిళలు 1,81,611 మంది, పురుషులు 1,74,853 మంది, ఇతరులు 17 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 6,758 మంది ఎక్కువగా ఉన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మహిళల కోసం అధికారులు కొన్నిచోట్ల ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మిగిలిన వారు మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు, పలు మహిళా సంఘాల నేతలు, ధార్మిక సంస్థలు ఇలా మహిళలు ఎక్కువగా ఉన్న అన్నిచోట్లా నేతలు వారి ఓట్లు ఎలా పొందాలా అన్న విషయమై ప్రణాళికలు రచిస్తున్నారు.

'భీమిలి జడ్పీటీసీ సభ్యుడ్ని సస్పెండ్ చేయాలి'

భీమునిపట్నం, మార్చి 31 : పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఆయన అనుచరులను వైసీపీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ పార్టీ మండల నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదివారం వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వెంకటప్పడుకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఎంతో గౌరవం ఇచ్చి జడ్పీటీసీగా, డీఎల్‌డీఏ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారన్నారు. ఇంతకాలం పదవులు అనుభవించి ఇపుడు పార్టీ మారడం ఆయన విజ్ఞతకే విడిచిపెడుతున్నామని చెప్పారు. తీర్మాన కాపీని జిల్లా కమిటీకి, ముఖ్యమంత్రి జగన్‌కు పంపిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దాట్ల ప్రసాదరాజు, భీమిలి ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, భీమిలి మండల వైసీపీ అధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అభివృద్ధికి చర్యలు

వెంకోజీపాలెం, మార్చి 31 : ఏయూ విద్యార్థులకు, నగర ప్రజలకు ఉపయుక్తంగా క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నామని ఏయూ ఇంజనీరింగ్ విభాగం డీన్ ఆచార్య కె. శ్రీనివాసరావు, యూనివర్సిటీ ఇంజనీర్స్ ఆర్. శంకరరావు, డి. రాజశేఖరరాజు తెలిపారు. ఆదివారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. వర్సిటీలో దశాబ్దాలుగా అసాంఘిక శక్తులకు అడ్డాగా ఉన్న స్థలాన్ని నగర ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా దాతల సహకారంతో తీర్చిదిద్దామన్నారు. దాన్ని మరింత అభివృద్ధి చేసి జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు ఉపయోగపడేలా అభివృద్ధి చేసే దిశగా పనిచేస్తున్నామని చెప్పారు. అలాగే ఏయూ భూములు అనేకచోట్ల అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని పరిరక్షించుకుని, సంరక్షించే చర్యలు చేపడుతున్నామన్నారు. ఏయూపై కొందరు అసత్య, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని,అది ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. వర్సిటీ మైదానాలు అభివృద్ధి చేయడానికి అన్ని అనుమతులు ఉన్నాయని తెలిపారు.

పారా అథ్లెటిక్స్‌లో వారిజ నేత్ర విద్యాలయం విద్యార్థులకు పతకాలు

భీమునిపట్నం, మార్చి 31 : బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో ఈనెల 24, 25వ తేదీల్లో జరిగిన 6వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మంగమారిపేట వారిజ ఆశ్రమంలోని నేత్ర విద్యాలయం విద్యార్థులు పలు పతకాలు సాధించారు. ఈమేరకు విద్యాలయం నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుంకరి దినేష్ కేటగిరీ టి-12లో 100, 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించగా వలసనాయిని రావన్న 400, 100 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకాన్ని సాధించారు. అలాగే కేటగిరీ-టి 11లో కిలక లలిత 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 200 మీటర్ల పరుగు పం దెంలో రెండు రజిత పతకాలు, 1500 మీటర్ల పరుగు పందెంలో రజితం సాధించినట్టు తెలిపారు.

గంటా మోసకారి : పాశర్ల

సింహాచలం, మార్చి 31 : భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ప్రజలను మరోసారి దగా చేయడానికి వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాశర్ల ప్రసాద్ విమర్శించారు. ఆదివారం ఆయన సింహాచలంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బాబు, జగన్, పవన్ రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు మోదీ కాళ్ల వద్ద తాకట్టు పెట్టారని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రాష్ట్రంలో, కేంద్రంలో అమలు చేయనున్న తొమ్మిది హామీలను వివరించారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



అలంకరించిన సమాధుల వద్ద క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు, ఆరిలోవలో శాంతియుత ర్యాలీ

ఆరిలోవ, మార్చి 31 : ఆరిలోవలోని పలు ప్రాంతాల్లో ఈస్టర్ పురస్కరించుకుని క్రైస్తవులు చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు వారికి క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం వీధుల్లో శాంతియుతంగా ర్యాలీలు జరిపారు.ఆరిలోవలోని హోలీ క్రైస్ట్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దైవజ్ఞులు బి. రవికుమార్, పాస్టర్ స్టీవెన్, పాస్టర్ ఇమాన్యుల్ పాల్గొన్నారు. పెదగదిలిలో ఇమాన్యుల్ చర్చి ఫాదర్ ఇమాన్యుల్ ఆధ్వర్యంలో భారీ విందు భోజనం ఏర్పాటు చేశారు.

చిట్టివలసలో...

తగరపువలస : ఈస్టర్ సందర్భంగా చిట్టివలసలో ఉన్న క్రైస్తవుల సమాధుల వద్ద లండన్ మిషన్ చర్చి సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మోహన్ కుమార్ కాటన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాధుల కమిటీ సభ్యులు సుహాసిని, సుధాకర్, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

భాను నగర్‌లో..

వెంకోజీపాలెం/సిరిపురం : భానునగర్ సీయోను మందిరంలో ఈస్టర్ పురస్కరించుకుని పాస్టర్ వంక శివశంకర్ లాజరస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కొండవాలు ప్రాంతంలోనూ, ఆరిలోవ, చర్చి చుట్టు పక్కల ప్రాంతాల్లో యేసు గొప్పతనాన్ని తెలియజేస్తూ ప్రచారం నిర్వహించారు.

అలాగే జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న వాల్తేరు సెమెట్రీలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరి గాయి. సెమెట్రీ అధ్యక్ష, కార్యదర్శులు జార్జిబీడి, డా. జి. మాధ్యూ పీటర్ నేతృత్వంలో తెల్లవారుజాము నుంచే వందలాది మంది తమ ఆత్మీయుల సమాధులను పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజెడ్ఎల్ క్వయర్ వారు మధురమైన భక్తి గీతాలు ఆలపించారు.